www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..
ఆదివారం
24-11-2024
సంపుటి : 01 | సంచిక : 202 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS
లక్ష్యం సమాజహితం
"6వ వార్షికోత్సవం"

6th ANNIVERSARY CELEBRATIONS

V3 NEWS
లక్ష్యం సమాజహితం

ప్రజలకు ప్రతినిధి, ప్రభుత్వానికి వారధి, సంక్షేమానికి సారథి, అక్షరాలా ఈ ఛానల్ మనది
ఆరేళ్లుగా జనాదరణ అద్భుతం.. అదే స్ఫూర్తితో అవుతున్నాం పునరంకితం..

## V3 న్యూస్ ఛానల్ ఆరవ వార్షికోత్సవం

అదే బాటలో విశ్వంభర తెలుగు దినపత్రికను
ప్రారంభించి ప్రజా సమస్యలపై పోరాడుతూ...
సామాజిక, సమకాలీన అంశాలపై కథనాలు
రాస్తూ తెలుగు పత్రికారంగంలో దూసుకెళ్తున్నాం.
దీనికి అనుబంధంగా మరో కొత్త ఆవిష్కరణ
"విశ్వంభర టీవీ" తో మీ ముందుకు వస్తున్నాం...
ఇప్పటివరకు "V3 న్యూస్ ఛానల్" ను,
"విశ్వంభర దినపత్రిక" ను
ఆదరిస్తున్న పాఠకులకు, వీక్షకులకు
కృతజ్ఞతాభివందనాలు.
అదేవిధంగా మీ ఆదరణ
"విశ్వంభర టీవీ" కి
కూడా ఉండాలని ఆకాంక్షిస్తూ...
మీ సహకారానికి
ధన్యవాదాలు



**డా॥ కాచం సత్యనారాయణ**
M.A,MSW,PGDCJ,LLB
చైర్మన్ - V3 న్యూస్ ఛానల్
విశ్వంభర తెలుగు దినపత్రిక
విశ్వంభర టీవీ
Cell: 9441222429

KACHAM PUBLICATIONS PVT. LTD. - KACHAM MEDIA AND BROADCASTING PVT. LTD.

# అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు మృతి, నలుగురి పరిస్థితి విషమం




**విశ్వంభర, అనంతపురం :** ఏపీలో అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న కూలీల ఆటోను బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసుపల్లె వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం జిల్లాలోని కుట్లూరు మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన కొంత మంది వ్యవసాయ కూలీలు ఆటోలో గార్లదిన్నెలో పని కోసం వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఆటోను ఢీ కొట్టింది.

ఘటనాస్థలిలోనే ఇద్దరు మృతి చెందగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. మృతులు తాతయ్య (55), చిననాగమ్మ (48), రామాంజనమ్మ (48), పెదనాగమ్మ (60), కొండమ్మ, జయరాముడు, చిననాగన్న. మృతులంతా పుట్లూరు మండలం ఎల్లుట్లకు చెందిన కూలీలుగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలాన్ని జిల్లా ఎస్పీ, డీఎస్పీ వెంకటేశ్వరులు పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. క్షతగాత్రులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

### అనంతపురం జిల్లా రోడ్డు ప్రమాదంపై
# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి




- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి

**విశ్వంభర, అనంతపురం :** అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గార్లదిన్నె మండలం కలగాసుపల్లె వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చిన సీఎం... ఒక్కో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.




### కొడంగల్‌లో ఏర్పాటు చేసేది
# ఫార్మాసిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్

- అక్కడి ప్రజలను నేనెప్పుడూ ఇబ్బంది పెట్టను
- యువత,మహిళలకు ఉపాధి కల్పించడమే ధ్యేయం
- వామపక్ష నేతలతో సీఎం రేవంత్ రెడ్డి..



**విశ్వంభర, హైదరాబాద్:** కొడంగల్‌లో ఏర్పాటు చేసేది ఫార్మా సిటీ కాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఆ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ నియోజకవర్గంలో యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమని సీఎం ఉద్ఘాటించారు. కొడంగల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యతని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సొంత నియోజకవర్గ ప్రజలను తానేందుకు ఇబ్బంది పెడతానంటూ చెప్పుకొచ్చారు. కాలుష్య రహిత పరిశ్రమలే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం పెంపును పరిశీలిస్తామని వెల్లడించారు. లగచర్ల ఘటనపై తనకు వినతిపత్రం ఇచ్చేందుకు సచివాలయానికి వచ్చిన వామపక్ష నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.

**సీఎంతో భేటీ..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కలిశారు. వారితోపాటు పలువురు వామపక్ష పార్టీల నేతలు సైతం సచివాలయంలో రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఇటీవల లగచర్ల గ్రామంలో లెఫ్ట్ పార్టీల నిజనిర్ధారణ కమిటీ బృందం పర్యటించింది. గ్రామస్థులతో మాట్లాడిన నేతలు దాడి ఘటనపై వివరాలు సేకరించారు. ముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా నిజనిర్ధారణ రిపోర్టును రేవంత్ రెడ్డికి వామపక్షాల నేతలు వివరించారు. గ్రామస్థులతో మాట్లాడిన వివరాలు, అక్కడి ప్రజలు ఏం కోరుకుంటున్నారు, దాడికి దారి తీసిన అంశాలు తదితర విషయాలపై రిపోర్టును సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా వారికి రేవంత్ రెడ్డి ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బయటకు వచ్చిన వామపక్షాల నేతలు మీడియాతో మాట్లాడారు.

**భూములు లాక్కోవద్దు..**

ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. "లగచర్ల గ్రామాన్ని సందర్శించాం. రైతులతో మాట్లాడాం. వాస్తవాలు, పరిస్థితులను తెలుసుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఘటనకు సంబంధించి నిజాలు వివరించాం. రైతుల భూములు లాక్కోవద్దని, పరిస్థితులు చక్కదిద్దాలని సీఎంకు చెప్పాం. గ్రామంలో పోలీస్ క్యాంపులు ఎత్తివేయాలని కోరాం. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. మా ముందే కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఆయనకు ధన్యవాదాలు. ఇండస్ట్రియల్ పార్క్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. అది కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీ కాదని తెలిపారు. అక్కడ భూములు బలవంతంగా తీసుకోవద్దని మేము కోరాం. సీలింగ్ లేదా ఇతర భూములు తీసుకోవాలని చెప్పాం. దానికి సీఎం సానుకూలంగా స్పందించారు. కమ్యూనిస్టులం మరోసారి అక్కడ పర్యటిస్తాం. ప్రజలకు భరోసా ఇస్తాం" అన్నారు.

**కొత్త పాలసీ ప్రకటించాలి..**

లెఫ్ట్ పార్టీలు లగచర్ల గ్రామానికి వెళ్లేందుకు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కిందిస్థాయి నుంచి వచ్చిన నేత కాబట్టి తమ మాటలకు సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. "అక్కడ ఫార్మా కంపెనీ పెట్టడం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకోసం భూములు తీసుకోవడం లేదనీ చెప్పారు. రైతులు అంగీకరిస్తేనే భూములు సేకరించాలి. మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. నిర్వాసితుల పాలసీని మార్చాలి. భూమికి భూమి ఇచ్చే విధంగా పాలసీ ఉండాలి. అసెంబ్లీ సమావేశాలలో పాలసీ ప్రకటించాలని కోరుతున్నాం" అని చెప్పారు.

## నేడే ఆర్యవైశ్య మహాసభకార్యవర్గ ప్రమాణ స్వీకారం




**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల ;** రాజన్న సిరిసిల్లా జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శ్రీ వాసవి కళ్యాణ మండపం , ఎస్ఆర్ఆర్ కే వాసవి నిత్యాన్నసత్రం, వాసవి నగర్ లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ విప్ , వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ హాజరు కానున్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి అధ్యక్షులుగా బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ , కోశాధికారి చీకోటి నాగరాజు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్య సంఘాలు, అనుబంధ సంస్థలు, మహిళా సంఘాలు , వాసవి సేవా దళ్ , రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య నాయకులు పాల్గొంటారని మహాసభ నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో నూతనంగా ఏర్పాటు అయినా మహాసభ ద్వారా ఆర్యవైశ్యుల అభివృద్ధికి, ఉన్నతికి, సామాజిక, సేవా, ఆర్థిక, రాజకీయ ఎదుగుదల లో ఆర్యవైశ్యుల ఐక్యతతో ముందుకెళ్లాలి అని మహాసభ నిర్వాహకులు తెలిపారు.

### చిలుకనగర్ డివిజన్ మైనారిటీ కబ్రిస్తాన్లో
## అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం
### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, సికింద్రబాద్ :** చిలుకనగర్ డివిజన్ మైనార్టీ కబరస్థాన్‌లో బండ రాళ్ల తొలగింపునకు రూ.18 లక్షల నిధులు కేటాయింపజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, కార్పొరేటర్ గీతా ప్రవీణ్‌కి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కబరస్థాన్ కమిటీ సభ్యులు.

కమిటీ ప్రతినిధులు గ్రేవియార్డులో సమాధులు పెట్టే ప్రాంతంలో పెద్దపెద్ద బండారాళ్లు అడ్డుగా ఉన్నాయని కార్పొరేటర్‌ని బండరాళ్ల తొలగించాలని గతంలో విన్నవించారు. వెంటనే కార్పొరేటర్ ఉప్పల్ శాసనసభ్యుడి సహకారంతో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ద్వారా నిధులు శాంక్షన్ చేయించి నందుకు వారికి మైనారిటీ కబ్రిస్తాన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌కు ఎమ్మెల్యే నివాసంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు బదిరుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, నర్సింగ్ రావు, కోకొండ జగన్ ,శ్యామ్, తిరుమలేష్, రాజు, కబరస్థాన్ కమిటీ సభ్యులు అధ్యక్షులు అబ్బు బాయ్, వారి కమిటీ సభ్యులు మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, ఎండీ షఫీ, ఎండీ హనీఫ్ (బిల్డర్), ఎండీ అల్తాఫ్, ఎండీ జలీల్, ఇబ్రహీం, పాషా , మహమ్మద్, బాబా పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోంది



**బండి సంజయ్**

**విశ్వంభర, కరీంనగర్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ యుద్ధం ప్రకటించబోతోందన్నారు. మహారాష్ట్రలో ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ కూటమిని నమ్మలేదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కరీంనగల్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కూటమి ముక్కలు కావడం ఖాయమన్నారు.తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలుకాబోతున్నాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలే కూలుస్తారని స్పష్టం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా మహారాష్ట్రలో పట్టిన గతే పడుతుంది. ఎందుకంటే ఒక్క హామీలను అమలు చేయలేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## భర్తను హతమార్చిన భార్య !
### పరారీలో నిందితురాలు
### తెలకపల్లి మండలం వట్టిపల్లిలో ఘటన

**విశ్వంభర, తెల్కపల్లి :** కట్టుకున్న భర్తను గొడ్డలితో హతమార్చింది భార్య అనంతరం అక్కడ నుంచి పరార్ అయింది. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం వట్టిపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... వట్టిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(50), ఎల్లమ్మ దంపతులు ఊర్లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మీరు ఇద్దరి మధ్య గత కొన్ని రోజులుగా తరచూ గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి రెండు,మూడు గంటల సమయంలో తన భర్తను గొడ్డలి తో హత్య చేసి అక్కడి నుంచి భార్య పారార్ అయి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. చుట్టుపక్కల వారు తెల్లవారి సమయం 12 కావస్తున్నా.. ఇంకా తలుపులు మూసి ఉండడం గమనించి తలుపులు తెరిచి చూసేసరికి ఈశ్వరయ్య రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దింతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తున్నారు. చంపింది భార్యయేనా..? మరి ఎవరైనా చంపి ఉంటారా..? అనే కోనంలో పోలీసులు కేసు ధర్యాప్తు చేస్తున్నారు.



V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
24-11-2024
సంపుటి : 01 | సంచిక : 202 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ CMD

# మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయం



## ఝార్ఖండ్‌లో జేఎంఎం జయకేతనం

- వయనాడ్‌లో గెలిచిన ప్రియాంక గాంధీ
- బర్‌హైత్‌లో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ విజయం
- కోప్రిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే విజయ ఢంకా



**ముంబయి, రాంచీ:**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి' అఖండ విజయం సాధించింది. విపక్ష మహా వికాస్ అఘాడీని చిత్తుగా ఓడించింది. ఆర్నెళ్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తగిలిన షాక్ నుంచి కోలుకుని బీజేపీ, శిందే శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో కూడిన 'మహాయుతి' కూటమి జయకేతనం ఎగురవేసింది. సీఎం ఎవరనేది తేలాల్సి ఉంది. మరోవైపు ఝార్ఖండ్‌లో మాత్రం ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ జేఎంఎం కూటమి అపూర్వ విజయాన్ని అందుకుంది. దీంతో హేమంత్ సోరెన్ మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. మహారాష్ట్రలో 288 స్థానాలకు గాను మహాయుతి కూటమి 232 స్థానాల్లో విజయం సాధించింది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 50 చోట్ల గెలుపొందింది. మిగతా5లో...

ఏక్ హైతో సేఫ్ హై.. నినాదమే..

## మహామంత్రంగా మారింది

- మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపాలన, నిజమైన సామాజిక న్యాయమే గెలిచాయి
- అబద్ధాలు, మోసం ఘోరంగా ఓడిపోయాయి
- 'మహాయుతి' అఖండ విజయంపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు

మహారాష్ట్రలో 'మహాయుతి' అఖండ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ప్రసంగించారు. 5



## పండుగలా ప్రజాపాలన విజయోత్సవాలు

- డిసెంబరు 1 నుంచి 9 వరకు నిర్వహించాలి
- అన్నిశాఖల భాగస్వామ్యం తీసుకోవాలి
- భవిష్యత్ కార్యక్రమాలను వివరించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యం మిగతా5లో...

## భద్రాద్రి రామయ్య ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**మంత్రి పొంగులేటి.. ఆలయ అధికారులతో భేటీ**

**విశ్వంభర, భద్రాచలం:** ఇందిరమ్మ రాజ్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేసి తీరతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో అన్నారు. తొలుత ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి మిగతా5లో...



## కాంగ్రెస్ మరోసారి నవ్వులపాలైంది

- ఇండియా కూటమికి మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు
- గత ఎన్నికల్లో ప్రజా తీర్పును ఉద్ధవ్ ఠాక్రే వంచించారు
- ఈ విజయంతో బీజేపీ మహారాష్ట్రలో హ్యాట్రిక్ కొట్టింది
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** దేశ ప్రజల ముందు కాంగ్రెస్ మరోసారి నవ్వుల పాలైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ప్రజలు బీజేపీకీ చక్కటి మెజార్టీ కట్టబెట్టారన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''రాహుల్‌గాంధీ మహారాష్ట్రలో విద్వేష ప్రచారం చేశారు. కులం, మతం పేరుతో ప్రజలను విడగొట్టాలని చూశారు. కానీ, ఇండియా కూటమికి మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఈ విజయంతో బీజేపీ మహారాష్ట్రలో హ్యాట్రిక్ కొట్టింది. గత ఎన్నికల్లో ప్రజా తీర్పును ఉద్ధవ్ ఠాక్రే వంచించారు. అనేక రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ 3 రాష్ట్రాలకే పరిమితమైంది'' అని అన్నారు.

## నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే లగచర్లలో దాడి

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదన**

లగచర్ల దాడి కేసులో హైకోర్టులో మరోసారి వాదనలు జరిగాయి 5

హిందీ మహావిద్యాలయం

## అనుమతులు రద్దు

- విద్యార్థుల మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఓయూ తేల్చిన విచారణ కమిటీ
- స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలని యూజీసీకి సిఫారసు

5

## కాలుష్యం నుంచి నదులను కాపాడుకుందాం

**సంరక్షించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి**

నీటి వనరులలో పెరుగుతున్న కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన లోక్ మంథన్ భాగ్యనగర్ 2024లో వక్తలు




**విశ్వంభర, హైదరాబాద్:** భాగ్యనగర్ లోని శిల్పకళా వేదికగా జరుగుతున్న లోకమంథన్ లో భారతీయ తత్వ చింతన - పర్యావరణ స్పృహపై మేధావులు మాట్లాడారు. ఇందులో భాగంగా పంచతత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ శిప్రా పాఠక్ మాట్లాడుతూ... భారత దేశ నదుల ప్రాశస్త్యం, పర్యావరణ స్పృహపై మాట్లాడారు. ఈ సందర్భంగా నదుల చారిత్రక, సాంస్కృతిక ఔచిత్యాన్ని వివరించారు. భారతీయ నదుల చుట్టూ నాగరికతలు ఎలా అల్లుకున్నాయో, నాగరికతలు ఎలా మిగతా5లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



**నేటి చికెన్ ధరలు**

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 107 | ₹ 129 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 187 | ₹ 213 |

## హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్

- చికిత్స పేరుతో ఆస్పత్రి సిబ్బంది అని చెప్పి చిన్నారిని తీసుకెళ్లిన గుర్తుతెలియని మహిళ
- ఆస్పత్రిలో భద్రతావైఫల్యమే కారణమంటున్న తల్లి




5



## నువ్వేమైనా చక్రవర్తివా?

**నీలాంటోళ్లు ఎంతోమంది కొట్టుకుపోయారు**

**రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం**

**చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్న పట్నం**

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగా చేయని తప్పునకు చర్లపల్లి జైల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చర్లపల్లి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా మిగతా5లో...

## తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారు

- ఐదు గ్యారంటీల పేరుతో చేసిన గారడీని ప్రజలను నమ్మలేదు
- ఝార్ఖండ్‌లో బీజేపీ కక్షసాధింపు విధానాలను ప్రజలు తిప్పికొట్టారు
- హరీశ్‌రావు విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్:** మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదు గ్యారంటీల పేరుతో మహారాష్ట్రలో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలను నమ్మలేదని స్పష్టమైందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించి గుణపాఠం చెప్పారని అన్నారు. మిగతా5లో...

# మరాఠా రాజకీయాన్ని మార్చేసిన బీజేపీ..

## రికార్డ్ స్థాయిలో మెజార్టీ

**"లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రకారం చూస్తే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఆ పార్టీ నాయకత్వంలోని మహాయుతి కూటమికి ఓటమి తప్పదని రాజకీయ పరిశీలకులు భావించారు.అయితే, అందుకు విరుద్ధంగా ఇప్పుడు రాష్ట్రం-లో అతిపెద్ద పార్టీగా బీజేపీ అవత-రించడంతో పాటు, ముఖ్యమంత్రి పదవి కూడా ఆ పార్టీకే దక్కుతుం-దనే చర్చ మొదలైంది.ఐదు నెలల్లో బీజేపీ మహారాష్ట్ర రాజకీయాన్ని ఎలా మార్చివేయగలిగింది?ఈ ప్రశ్నకు "మహాయుతి కూటమి వ్యూహమే ఇందుకు కారణం. లాడ్లీ బహీన్ యోజన, హిందుత్వ, కులాలను ఏకం చేసే వ్యూహం బీజేపీకి ఈ విజయాన్ని అందించాయి".**

"ఐదు నెలల్లో చాలా జరిగింది. మొదట లాడ్లీ బహీన్ పథకాన్ని తెచ్చారు. ఇందులో 2.5 కోట్ల మంది మహిళల ఖాతాల్లో నాలుగు నెలల డబ్బులు జమ చేశారు. దీనితో పాటు, 'బంటేంగే టు కటేంగే' (విడిపోతే పడిపోతాం), 'ఏక్ రహేంగేతో సేఫ్ రహేంగే' (ఒక్కటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) అనే నినాదాలు వచ్చాయి. దీంతో హిందువుల ఓట్లు ఏకమయ్యాయి".

"గేమ్ ఛేంజర్"గా లాడ్లీ బహీన్ పథకం' ..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'లాడ్లీ బహీన్ స్కీమ్' ను "గేమ్ ఛేంజర్"గా అభివర్ణిస్తున్నారు విశ్లేషకులు. ట్రెండ్స్ చూస్తే ఈ స్కీమ్ మొత్తం పరిస్థితిని మార్చేసిందని చెప్పవచ్చు.ఈ పథకంలో భాగంగా మహిళలకు ప్రతి నెలా 1,500 రూపాయల చొప్పున ఇవ్వాలని ప్రతిపాదించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల కంటే తక్కువ ఉన్న 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ఈ పథకానికి అర్హులు. ఈ స్కీము లబ్ధిదారుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. లాడ్లీ బహీన్ యోజన, ఇతర ప్రభుత్వ పథకాలు గేమ్ ఛేంజర్‌గా పనిచేశాయి. వీటి ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ కనిపించింది".

"మరాఠా ఉద్యమం, రైతులకు ఉపశమనం కలిగించింది. వారి సమస్యలపై ప్రభుత్వం కసరత్తు చేసింది. ఇవే కాకుండా 'బాటేంగేతో కాటేంగే', 'ఏక్ హోతో సేఫ్ హై' అనే నినాదాల తరహాలో పోలరైజేషన్ రాజకీయాలు కూడా బీజేపీకి అనుకూలంగా పనిచేశాయి. ఆర్ఎస్ఎస్ ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా విదర్భ ప్రాంతంలో మహాయుతికి మద్దతుగా ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసింది. ఓటింగ్ రోజు కూడా, ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకురావడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషించింది" అని చెప్పవచ్చు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్కువ ర్యాలీలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రంలో ప్రధాని ఎక్కడ ర్యాలీలు నిర్వహించారో అక్కడ బీజేపీ ఓడిపోయింది. ఈ కారణంగానే ఈసారి వ్యూహం మార్చి ర్యాలీలను తగ్గించారు.ఈసారి ఎన్నికలు స్థానిక సమస్యలపైనే జరుగుతున్నాయని, స్థానిక నేతలే ఎక్కువగా ర్యాలీల్లో ప్రసంగించారు. "లోక్‌సభ ఎన్నికల్లో చేసిన తప్పుల నుంచి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి గుణపాఠం నేర్చుకుంది".

"మహాయుతి కూటమి ఓబీసీ ఓటర్లను తమ వైపుకు తీసుకురావాలని ప్రయత్నించింది. ఉల్లి ఎగుమతిపై నిషేధం విధించడంతో ఉత్తర మహారాష్ట్రలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం విధానపరమైన మార్పులు చేసింది. అదే సమయంలో బీజేపీ తన ఓటు బ్యాంకును కాపాడుకుంది".

దారుణంగా పడిపోయిన కాంగ్రెస్ పార్టీ బలం..

అయితే ఈ ఎన్నికల్లో దారుణంగా పడిపోయింది కాంగ్రెస్ పార్టీ బలం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లను గెలుచుకున్న హస్తం పార్టీ.. ఈ సారి భారీగా తన సీట్లను కోల్పోయింది. ఆ మేరకు బీజేపీ సీట్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. కంచుకోటగా భావించిన నియోజకవర్గాల్లో సైతం ఈ ఎన్నికల్లో గల్లంతయింది హస్తం పార్టీ. నాందేడ్ లోక్‌సభతో



స్థానంతో పాటు నాందేడ్ నార్త్, సౌత్ స్థానాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలయింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాందేడ్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వసంత్ చవాన్ విజయం సాధించారు. అయితే అనారోగ్యంతో ఆయన కన్ను మూయడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమయింది. ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సంతుక్‌రావ్ చేతిలో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చవన్ రవీంద్ర వసంత్‌రావ్ ఓటమిపాలయ్యారు.

మహారాష్ట్రలో 11 జిల్లాలున్న విదర్భ ప్రాంతాన్ని అధికారానికి కీలకంగా భావిస్తారు. ఇక్కడ ఉన్న 62 స్థానాల్లో కొన్నేళ్లుగా బీజేపీ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా మహావికాస్ అఘాడీ 10 మంది ఎంపీలను దక్కించుకొంది. దీంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమదే హవా అనుకుంది. కానీ ప్రచారం మొదలయ్యాక, ఎన్నికల దగ్గర పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖాముఖి తలపడ్డ స్థానాల్లో దాదాపు 40 సీట్లలో మహాయుతి విజయం సాధించింది. ఇక్కడి ఓటర్లను ఆకట్టుకొనేందుకు కాంగ్రెస్ చేసిన ప్రచారం అంతగా ఫలితం చూపలేదు. సోయా రైతులకు రూ.7,000 మద్దతు ధర ఇస్తామని చెప్పినా ఫలించలేదు. మరోవైపు మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు వేళ తలెత్తిన విభేదాలు కూడా ఎన్నికలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

రాహుల్ గాంధీ వ్యూహం ఎక్కడ విఫలమైంది?

అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ ఆఘాడి కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ 101 స్థానాల్లో పోటీ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో కనబరిచిన తన పనితీరును పునరావృతం చేస్తుందని, అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావించారు. "మహాయుతి ప్రభుత్వం లాడ్లీ బహీన్ పథకాన్ని తీసుకువచ్చినప్పుడు, మహావికాస్ అఘాడి దానిని విమర్శించింది. ఈ పథకాన్ని కొనసాగించలేరని ఆరోపించింది. ఆ తర్వాత మహావికాస్ అఘాడీ తన మేనిఫెస్టోలో మహిళలకు 3 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించింది". "మహావికాస్ అఘాడి కూటమిలోని పార్టీలు కలిసి పనిచేయడం పెద్దగా కనిపించలేదు. కూటమిలో తమ బలం ఎక్కువ కాబట్టి తమకు ఎక్కువ సీట్లు వస్తాయని కాంగ్రెస్ భావించింది. దీంతో కాంగ్రెస్, శివసేన మధ్య దూరం పెరిగింది. మరోవైపు, రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధం లేని అదాని, ధారావి, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై దృష్టి సారించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల ఆధారంగా ఎన్నికల్లో విజయం సాధించేట్లైతే, వామపక్షాలు దేశాన్ని పాలిస్తూ ఉండేవి. ఎందుకంటే వాళ్లు ఈ సమస్యల మీద ఎక్కువగా పోరాడుతూ వచ్చారు.

టిక్కెట్ రాలేదని పోటీకి దిగిన తిరుగుబాటు అభ్యర్థుల వల్ల మహావికాస్ అఘాడీకి ఎక్కువ నష్టం జరిగింది.

హిందుత్వ కార్డు ఎలా పని చేసింది ?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతలు 'బంటేంగే తో కటేంగే' నాదాన్ని విస్తృతంగా ఉపయోగించారు. 'కలిసి ఉంటేనే సురక్షితం' అని ప్రధాని నరేంద్ర మోదీ నినాదాలు చేశారు.

"హిందుత్వ రాజకీయాల విషయానికొస్తే, దేశం అంతటా బీజేపీ హిందుత్వ రాజకీయాలు చేస్తోంది. వీటిని ఎదుర్కోవడంలో, గట్టిగా తిప్పి కొట్టడంలో కాంగ్రెస్ విఫలం అవుతోంది. "మహా వికాస్ అఘాడికి బీజేపీ హిందుత్వ వ్యూహం గురించి అవగాహన లేదు. రాహుల్ గాంధీ జేఎన్‌యూ ప్రొఫెసర్‌లాగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో ఆయనకు ఎలాంటి వ్యూహాలు ఉండటం లేదు. కాంగ్రెస్ నేతలు ఓబీసీల గురించి మాట్లాడతారు. అయితే దేశ ప్రధానమంత్రి సహా అనేక మంది ఓబీసీలు కేంద్రంలో కీలక పదవుల్లో ఉన్నారు". "మహావికాస్ అఘాడి మతతత్వ అంశంపై బహిరంగంగా మాట్లాడి ఉండాలి. హిందువుల ఓట్లు చీలిపోతాయని కాంగ్రెస్ ఎప్పుడూ భయపడుతూ ఉంటుంది. ఇప్పటి వరకు హిందువుల ఓట్లు చీలలేదు. అదానీ వ్యవహారం స్టాక్ మార్కెట్లు, వ్యాపార వర్గాలు, దర్యాప్తు సంస్థలకు సంబంధించినది. దానితో మహారాష్ట్ర ప్రజలకు ఏం అవసరం ఉంది? కాంగ్రెస్ హయాంలో టాటా, అంబానీ లాంటి ఎందరో వ్యాపారవేత్తలు పుట్టారు. ఇప్పుడు ప్రధాని మోదీ హయాంలో అదానీ ఉన్నారు.

మరాఠా రాజకీయాన్ని మార్చేసిన బీజేపీ ఇక స్పీడ్ పెంచి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై గట్టిగా గురిపెట్టబోతోంది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా అడుగులేసేందుకు కమలదళం సిద్ధమవుతోన్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుత భారీ మెజార్టీతో గెలుపొందింది. బీజేపీ 130కి పైగా స్థానాల్లో విజయం సాధిస్తోంది. కాగా షిండే వర్గం 55 సీట్లకు పైగా విజయం సాధిస్తోంది. మహాకూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో భారీ విజయాన్ని అందుకుంటోంది. అజిత్ పవార్ వర్గం కేవలం 53 స్థానాల్లో మాత్రమే పోటీ చేసింది. వీరిలో 41 మంది అభ్యర్థులు విజయం సాధించారు. ఇందులో అతని ప్రియమైన సోదరీమణులు కూడా ఉన్నారు. అజిత్ పవార్ ప్రియతమ సోదరీమణులను ప్రజలు భారీ ఓట్లతో గెలిపించారు.

ఎన్నికల ముందు ప్రచారంలో అజిత్ పవార్ చాలాసార్లు లడ్కా బహినే యోజన గురించి ప్రస్తావించారు. అజిత్ పవార్ గ్రూపు నుంచి నలుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించారు. అంటే అజిత్ పవార్ గ్రూపులోని నలుగురు సుందరమైన సోదరీమణులు ప్రజల ఆశీస్సులు పొందారు. ప్రస్తుతం 288 సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీ 234 సీట్లు ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 48 స్థానాలు, ఇతరులు 6 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నాయి.







# షిండేనా.. ఫడ్నవీసా.. మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరు..?

**మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న తరుణంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూటమిలోని పెద్ద పార్టీ అయిన బీజేపీనే ఈ సారి సీఎం పదవి చేపడుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది.కూటమిలో బీజేపీకే అత్యధిక సీట్లు వచ్చాయి. దీంతో ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీసే బీజేపీ తరఫున మహా తదుపరి సీఎం అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఫడ్నవీస్ మద్దతుదారులు సైతం ఇదే డిమాండ్ చేస్తున్నారు.**



### ఫడ్నవీసే మహా తదుపరి సీఎం..

మహారాష్ట్ర తదుపరి సీఎంగా ఫడ్నవీసే బాధ్యతలు చేపడతారంటూ బీజేపీ నేత ప్రవీణ్ దకేకర్ కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో మహా తదుపరి సీఎంగా ఫడ్నవీసే ఖాయంగా తెలుస్తోంది. ఇదే విషయమైన ఫడ్నవీస్ తల్లి సరితా ఫడ్నవీస్ స్పందించారు. కచ్చితంగా తన కుమారుడే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్ 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తన కుమారుడు పెద్ద నాయకుడిగా ఎదిగినందుకు సంతోషంగా ఉందన్నారు.

### సీఎం ఎవరనేది కూర్చుని నిర్ణయిస్తాం : ఏక్‌నాథ్ షిండే

మరోవైపు ఏక్‌నాథ్ షిండే నే మహారాష్ట్ర తదుపరి సీఎం అని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో సీఎం ఏక్‌నాథ్ షిండే మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. అధికార కూటమికే మళ్లీ పట్టం కట్టిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ సీఎం మీరే అవుతారా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. కూటమిలోని మూడు పార్టీల నేతలం కూర్చుని సీఎం ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పారు. ఈసారి పెద్ద పార్టీ అయిన బీజేపీ సీఎం పదవి చేపడుతుందా..? అని మీడియా ప్రశ్నించగా 'కూటమిలోని పెద్ద పార్టీయే సీఎం పదవి చేపట్టాలనే రూల్ ఏం లేదుగా..!' అని షిండే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సీఎం సీటు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గెలుపు సంతోషం కంటే కూటమికి నేతలకు సీఎం అభ్యర్థి ఎంపికే కష్టతరంగా మారబోతోందంటూ చర్చించుకుంటున్నారు.

### ముంబైకి కేంద్ర పరిశీలకులు

మరోవైపు ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ అగ్రనాయకత్వం రేపు ముంబైకి కేంద్ర పరిశీలకులను పంపనున్నట్లు తెలిసింది. వారు కూటమి పార్టీలతో చర్చలు జరపనున్నారు. కూటమిలోని మూడు పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే సీఎం ఎవరన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### 26న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం..

మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 25న లెజిస్లేటివ్ పార్టీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సీఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఆ తర్వాతి రోజు అంటే ఈనెల 26న కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. మహా అసెంబ్లీ గడువు ఈనెల 26తో ముగియనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గెలిచిన వాళ్లు 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

## లోక్ మంథన్ లో అగ్నిని ఆరాధించిన లిథునియా అతిథులు



**విశ్వంభర, హైదరాబాద్:** భాగ్యనగరం వేదికగా జరుగుతున్న లోక్ మంథన్ కళాకారులు, మేధావులతో పాటు విదేశీయులను కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది. భారతీయ సాంస్కృతిక కార్యక్రమాల పట్ల, సంస్కృతి పట్ల బాగా ఆకర్షితులవుతున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక వాయిద్యాలు, కళాకారులను అత్యంత సూక్ష్మంగా పరిశీలిస్తూ.. వాటి గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో ఓ విశేషత కనిపించింది. లిథునియా రాజ్యానికి చెందిన వారు కూడా ఇక్కడికి వచ్చారు. వారు ఈ లోక్ మంథన్ కార్యక్రమం జరుగుతున్న శిల్పకళా వేదిక ఆవరణలో అగ్నిని ఆరాధిస్తూ కనిపించారు. అక్కడే ఓ చిన్న హోమ గుండం, సమిధలను ఏర్పాటు చేసి, అత్యంత శ్రద్ధాసక్తులతో అగ్నిని ఆరాధించారు. అంతేకాకుండా మంత్రాలను కూడా ఉచ్చరించారు. దీంతో ఆ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరూ విశేషంగా వారి వైపే చూశారు.

కొండపోచమ్మ, మల్లన్న సాగర్ నుంచి

## హైదరాబాద్‌కు నీటి తరలింపు

హైదరాబాద్‌కు తాగునీటి తరలింపుపై సీఎం రేవంత్ సమీక్ష

**విశ్వంభర, హైదరాబాద్:** కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి హైదరాబాద్‌కు నీటి తరలింపుపై సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, హైదరాబాద్ తరలింపునకు ఎంత ఖర్చవుతుందనే అంశాలపై పూర్తి అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. వచ్చే నెల 1 నుంచి టెండర్ల ప్రక్రియ చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారుల తో సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జలమండలి ఎండీ, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి ప్రశాంత్ జె.పాటిల్ పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్య ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంగళ వాయిద్యాలు, పూలమాలలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలోని సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఉపాలయంలోని లక్ష్మి తాయారు అమ్మవారి ఆలయంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంత్రితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భద్రాచలంలోని ఏఎంసీ కాలనీలో గతంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. అక్కడ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. లెక్కల్లో చాలా తేడాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో భద్రాచలం అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మొదటి విడత రూ.68 కోట్లతో స్థల పరిశీలన పనులు త్వరలోనే మొదలు పెడతామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మరిన్ని నిధులను మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే లగచర్లలో దాడి

**విశ్వంభర , హైదరాబాద్:** వికారాబాద్ జిల్లా లగచర్ల దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో మరోసారి వాదనలు జరిగాయి. కొడంగల్ కోర్టు విధించిన రిమాండ్‌ను కొట్టివేయాలని పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం చేపట్టాలనుకున్న భూసేకరణకు వ్యతిరేకంగా, ప్రజలను రెచ్చగొట్టేలా నరేందర్ రెడ్డి మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆ వీడియోలను సీడీల రూపంలో కోర్టుకు అందజేశారు. నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే ప్రజలు కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడ్డారని ఆయన వాదించారు. నరేందర్ రెడ్డిని కేబీఆర్ పార్కు వద్ద అరెస్ట్ చేయలేదన్నారు. కేబీఆర్ పార్కుకు వెళ్తుంటే అరెస్ట్ చేశారని ఆయన సమర్పించిన అఫిడవిట్‌లోనే ఉందని పీపీ కోర్టుకు తెలిపారు. 15మంది పోలీసులు మఫ్టీలో వచ్చి నరేందర్‌రెడ్డిని ఓ ఉగ్రవాదిలా అరెస్ట్ చేసి తీసుకుపోయారని ఆయన తరఫు న్యాయవాది గండ్ర మోహన్‌రావు కోర్టుకు తెలిపారు. అరెస్ట్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను కోర్టుకు అందించారు. అరెస్ట్ సమయంలో పోలీసులు సుప్రీంకోర్టు నిబంధనలు పాటించలేదని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

# ఏక్ హై తో సేఫ్ హై.. నినాదమే.. మహామంత్రంగా మారింది

**ఢిల్లీ:** మహారాష్ట్రలో 'మహాయుతి' అఖండ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ప్రసంగించారు. మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపాలన, నిజమైన సామాజిక న్యాయమే గెలిచాయని.. అబద్ధాలు, మోసం ఘోరంగా ఓడిపోయాయన్నారు. మహారాష్ట్ర అన్ని రికార్డులను బ్రేక్ చేసిందన్న ప్రధాని మోదీ.. గత 50 ఏళ్లలో ఏ పార్టీ గానీ, ఎన్నికల ముందు ఏర్పాటైన కూటమిగానీ ఇంతటి ఘన విజయం సాధించలేదన్నారు. వరుసగా మూడుసార్లు బీజేపీకి అధికారం అందించిన ఆరో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని తెలిపారు. హరియాణా ఎన్నికల తర్వాత మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిపెద్ద సందేశం ఐక్యతేనని పేర్కొన్నారు. 'ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం (ఏక్ హై తో సేఫ్ హై..)' అనే నినాదమే ఇప్పుడు దేశానికి మహా మంత్రంగా మారిందని చెప్పారు.

**కాంగ్రెస్ అర్బన్ నక్సలిజం దేశానికి సవాల్!**

కాంగ్రెస్ అర్బన్ నక్సలిజం దేశానికి సవాల్‌గా మారిందని, దాని రిమోట్ కంట్రోల్ దేశం వెలుపల ఉందని విమర్శించారు. అధికారం కోసం దురాశతో కులతత్వం అనే విషాన్ని వ్యాపింపజేస్తోందని మండిపడ్డారు. మహారాష్ట్రలో అస్థిరతను సృష్టించేందుకు యత్నించిన, ద్రోహానికి పాల్పడిన కొందరిని ఓటర్లే శిక్షించారని ప్రధాని అన్నారు. దేశానికి ప్రథమస్థానం ఇచ్చేవారితోనే తప్ప కుర్చీకి ప్రాధాన్యం ఇచ్చేవారితో ఓటర్లు ఉండరని వ్యాఖ్యానించారు.
దేశ ప్రజల ఆకాంక్షలను 'ఇండియా' కూటమి అర్థం చేసుకోలేకపోయిందని తెలిపారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం మాత్రమే ప్రజలకు ఆమోదయోగ్యమైనదని.. ప్రపంచంలోని ఏ శక్తీ ఆర్టికల్ 370ను పునరుద్ధరించలేదని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పరాన్నజీవి పార్టీగా మారిపోయిందని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం దానికి కష్టతరంగా మారిందన్నారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు వక్ఫ్‌బోర్డే ఓ ఉదాహరణ అని విమర్శించారు.

# కాలుష్యం నుంచి నదులను కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధి పొందాయో వివరించారు. అలాగే ఆ నాగరికతల చుట్టూ సామాజిక పరివర్తన ఎలా జరిగిందో కూడా విశ్లేషించారు. అలాగే నీటి వనరులలో పెరుగుతున్న కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పౌరులందరూ నదులను సంరక్షించడానికి, కాలుష్యం బారి నుంచి వాటిని కాపాడుకోడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. భగీరథ్ గ్రామ వికాస్ ప్రతిష్ఠాన్ చైర్మన్ ప్రసాద్ వామన్ దేవధర్ గ్రామీణ అభివృద్ధికి అవసరమైన వినూత్న విధానాలపై ప్రసంగించారు. బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా పశువులు, ఆవు ఎరువును పర్యావరణ అనుకూల ఇంధనంగా మార్చుకునే విధానంపై కూలంకషంగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ చేస్తున్న విషయాలను పంచుకున్నారు. అలాగే గ్రామీణ సాధికారతకు చేస్తున్న కృషిని వివరించారు. తక్కువ డబ్బులతో గ్రామీణ వాసులకు బయోగ్యాస్ ప్లాంట్లను తాము అందిస్తున్నామని, ఈ అందించే విధానంపై కూడా లోక్ మంథన్ వేదికగా వామన్ దేవధర్ వివరించారు.

# హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని నీలోఫర్ ఆస్పత్రిలో నెలల వయసున్న పసికందును గుర్తు తెలియని మహిళ కిడ్నాప్ చేసింది. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫర్ దంపతులకు బాబు జన్మించాడు. పసికందుకు జాండీస్ రావడంతో చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో చికిత్స పేరుతో ఆస్పత్రి సిబ్బంది అని చెప్పిన గుర్తుతెలియని మహిళ.. చిన్నారిని తీసుకెళ్లింది. ఎంతసేపటికీ బాబును తీసుకురాకపోవడంతో ఆస్పత్రి మొత్తం వెతికినా బాబు, ఆ మహిళ కనిపించలేదు. అనుమానం వచ్చిన తల్లి హసీనా వెంటనే నాంపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో భద్రతా వైఫల్యం కారణంగానే కిడ్నాప్ చేశారని బాధిత తల్లి ఆరోపిస్తున్నారు.

# పండుగలా ప్రజాపాలన విజయోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

పంచుకోవాలని చెప్పారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. శనివారం సాయంత్రం సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన-విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్లో ఈనెల 19న మహిళా శక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సభ విజయవంతమైందని ముఖ్యమంత్రి అధికారులను అభినందించారు. నెల 30వ తేదీన మహబూబ్‌నగర్ లో ఏర్పాటు చేసే రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించా రు. రెండు రోజుల ముందు నుంచే.. 28వ తేదీ నుంచే రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమా లు నిర్వహించాలని, వారికి అవసరమైన ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటల బీమా, సన్న వడ్లకు బోనస్.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తొలి ఏడాదిలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.
డిసెంబర్ 4వ తేదీన పెద్దపల్లి జిల్లాల్లో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరపాలని ముఖ్యమంత్రి



నిర్ణయించారు. అదే వేదికగా గ్రూప్ 4 తో పాటు వివిధ రిక్రూట్మెంట్ల ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.
డిసెంబర్ 1వ తేదీ నుంచి శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలన్నీ ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. తమ శాఖల వారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతో పాటు భవిష్యత్తు ప్రణాళికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. ఈ మూడు రోజుల పాటు హైదరాబాద్లో సెక్రటేరియట్ పరిసరాలు, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతమంతా ఎగ్జిబిషన్ లాంటి వాతావరణం ఉండేలా వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. మూడు రోజుల పాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టి పడే కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, కన్నుల పండువలా ఉండే డ్రోన్ షోలను నిర్వహించాలని సూచించారు. అన్ని వర్గాలను ఇందులో భాగస్వాములను చేయాలని చెప్పారు. రాష్ట్రమంతటా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్సవ వాతావరణం ఉట్టిపడాలని చెప్పారు.

**డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ**

డిసెంబర్ 9వ తేదీన సెక్రెటేరియట్ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గానికో వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి... లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ నగరంలో జరిగే ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను ఆదేశించారు. సెక్రెటేరియట్, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పై ఉత్సవాలు జరిగేందుకు వీలుగా వాహనాలను దారి మళ్లించాలని సూచించారు.

# మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

మరో రెండు చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. మహాయుతి కూటమిలో బీజేపీ అత్యధిక స్థానాలు సాధించింది. ఝార్ఖండ్‌లో జేఎంఎం కూటమి 56 స్థానాల్లో విజయం సాధించింది. అటు బీజేపీ నేతృత్వంలోని కూటమి 24 స్థానాల్లో గెలుపొందింది. ఈ రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలుండగా.. మ్యాజిక్ ఫిగర్ 41. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ భారీ విజయం సాధించారు. తన సమీప అభ్యర్థిపై 4 లక్షల ఓట్ల పైచిలుకు మెజార్టీ దక్కించుకున్నారు.బర్హైత్‌లో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ విజయం సాధించారు.. గండేలో ఆయన భార్య కల్పనా సోరెన్ గెలుపొందారు. మహారాష్ట్రలో కీలక స్థానాల్లో ఒకటైన వర్లీలో శివసేన (యూబీటీ) నేత, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే 8801 ఓట్లతో గట్టెక్కారు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో బీజేపీ అభ్యర్థి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విజయం సాధించారు.బారామతిలో ఎన్సీపీ అభ్యర్థి అజిత్ పవార్ గెలుపొందారు.కోప్రిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే విజయ ఢంకా మోగించారు.

**ఈ ఫలితాలు అనూహ్యమని, సమగ్రంగా విశ్లేషిస్తాం: రాహుల్ గాంధీ**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందిన విషయం తెలిసిందే. వీటిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఫలితాలు అనూహ్యమని, సమగ్రంగా విశ్లేషిస్తామని అన్నారు. ఝార్ఖండ్‌లో ఫలితాలపై మాట్లాడుతూ.. రాజ్యాంగంతోపాటు నీరు, అడవులు, భూమిపై విపక్ష కూటమి సాధించిన విజయమన్నారు. వయనాడ్‌లో ప్రియాంక గాంధీ ని స్థానిక ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించినందుకు గర్విస్తున్నానన్నారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి ప్రియాంక పాటుపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

**సునామీలా విరుచుకుపడింది: ఉద్ధవ్ ఠాక్రే**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అస్సలు ఊహించలేదని ప్రతిపక్ష నేత, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. అధికార మహాయుతి ఒక కెరటంలా కాకుండా సునామీలా విరుచుకుపడిందని వ్యాఖ్యానించారు. ఫలితాలు ఎలా ఉన్నా.. మహారాష్ట్ర హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామన్నారు.

**'మహా' ఫలితాలు ఆశ్చర్యకరం: జైరాం రమేశ్**

మహారాష్ట్ర ఫలితాలు ఆశ్చర్యకరమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఎన్నికల పారదర్శకతపై తాము ప్రశ్నలను లేవనెత్తుతూనే ఉంటామన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఎన్నికల్లో పారదర్శకతకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం తమ బాధ్యతన్నారు. ఝార్ఖండ్ వాసులు తమ కోసం పనిచేసిన ప్రభుత్వాన్నే గెలిపించారని, విభజనవాద రాజకీయాలను తిరస్కరించారని వ్యాఖ్యానించారు.

# హిందీ మహావిద్యాలయం అనుమతులు రద్దు

**విశ్వంభర, హైదరాబాద్:** హిందీ మహావిద్యాలయం అనుమతులను ఉస్మానియా యూనివర్సిటీ రద్దు చేసింది. విద్యార్థుల మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఓయూ విచారణ కమిటీ తేల్చడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఓ ప్రైవేటు కళాశాలలో ఓయూ అధికారుల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు విచారణ కమిటీ ఇటీవల నిర్ధరించింది. ఈ మేరకు హిందీ మహావిద్యాలయం స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలని యూజీసీకి సిఫారసు చేసింది. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కోర్సు పూర్తి చేసేందుకు ఓయూ అవకాశం కల్పించింది.

# మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం

## సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ కీలక సూచన

**విశ్వంభర, హైదరాబాద్:** మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని జనం తిరస్కరించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్ కు ప్రాంతీయ పార్టీలే గట్టి పునాదులన్న సందేశం ఇచ్చే విధంగా రెండు రాష్ట్రాల ప్రజలు తమ తీర్పు ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీకి బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని దయనీయ పరిస్థితిలో కాంగ్రెస్ ఉందని చెప్పారు. కేవలం కాంగ్రెస్ చేతగాని, అసమర్థ విధానాల కారణంగానే బీజేపీ మనుగడ కొనసాగుతుందని అన్నారు.

**ప్రాంతీయ పార్టీలు బలంగా లేని చోటే..**

ప్రాంతీయ పార్టీలు బలంగా లేని చోట మాత్రమే బీజేపీ గెలుస్తుందని కేటీఆర్ తెలిపారు. తమ చేతగానితనాన్ని, అసమర్థతను గుర్తించాల్సింది పోయి ఇప్పటికీ సిగ్గు లేకుండా ప్రాంతీయ పార్టీలను ఎలా అంతం చేయాలన్న కుట్రపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టిందని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలన్న కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు.. బీజేపీ తక్కువ కాదని విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి దేశంలో ప్రాంతీయ పార్టీలు ఉండొద్దన్నట్లుగా కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కుట్రలో భాగంగానే ప్రాంతీయ పార్టీలు చేసిన అభివృద్ధి, వారి ప్రాంతాల కోసం నిబద్ధతతో కృషి చేసిన విధానాలపై కూడా కాంగ్రెస్, బీజేపీ లు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ లు ఎన్ని కుట్రలు చేసిన ప్రాంతీయ పార్టీలను ఏమీ చేయలేరని స్పష్టం చేశారు.

**ఇకనైనా గెలిపించిన ప్రజల కోసం రేవంత్ పనిచేయాలి**

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఘోర ఓటమి నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలు అంటించారు. తెలంగాణలో ఏదో పొడిచేశామని మీరు చేసిన అబద్ధపు ప్రచారాలను మరాఠా ప్రజలు నమ్మలేదని అన్నారు. మీ ప్రచారాలు, ప్రసంగాలు, బ్యాగులు, ఛాపర్లు అన్ని కూడా మీ పార్టీని ఘోర ఓటమి నుంచి కాపాడలేకపోయాయని విమర్శించారు. ఇకనైనా ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రిగా తన ప్రాథమిక కర్తవ్యంపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే పని మీద దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సలహా ఇచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పదిరోజులకో పసిబిడ్డ ప్రాణం పోతోంది

- ఆ పిల్లల కుటుంబాలకు 10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో పది రోజులకో పసిబిడ్డ ప్రాణం పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పసి బిడ్డల ప్రాణాలను ప్రాధాన్యతగల అంశంగా స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క పాఠశాలను చూసినా ఏదో ఒక సంఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ... తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పసిబిడ్డల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టనట్టు ఉండటం సరికాదని సూచించారు. "ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుంది, సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటి వరకు 42 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆహారం విషతుల్యమై మరణించారు. సగటున పదిరోజులకు ఒక పసి ప్రాణాన్ని ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సంక్షేమ శాఖలు కూడా ముఖ్యమంత్రి వద్ద ఉండటం వల్ల సమయం వెచ్చించలేకపోతున్నట్లు కనిపిస్తోందని అన్నారు. కనీసం పది నిమిషాల సమయాన్ని కేటాయించి సమీక్ష చేస్తే పసి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుందని సూచించారు. నారాయణపేట హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా పిల్లలు అనారోగ్యం పాలైన తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష చేసిన మరునాడే అలాంటి మరో సంఘటన జరగడం ఆందోళనకరమని అన్నారు. పిల్లలు కూడా ధర్నా చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఐఐటీ, ఐఐఎంకు వెళ్లాలా లేకపోతే ఎవరెస్టు అధిరోహించాలా అన్న ఉన్నతమైన ఆశయాలు, లక్ష్యాలతో వెళ్లిన సందర్భాన్ని తెలంగాణ సమాజం చూసిందని గుర్తు చేశారు.


# నువ్వేమైనా చక్రవర్తివా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న పట్నం నరేందర్ రెడ్డితో కేటీఆర్ శనివారం ములాఖత్ అయ్యారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరఫున పోరాటం చేసిన పాపానికి జైలు పాలైన మా నరేందర్ రెడ్డి గారిని చర్లపల్లి జైల్లో పరామర్శించామని తెలిపారు. పట్నం నరేందర్ రెడ్డిని కలిసినప్పుడు ఆయన తన గురించి కాకుండా 30 మంది అమాయక రైతులను విడిపించండని చెప్పారని తెలిపారు. అందుకు నరేందర్ రెడ్డికి అభినందనలు చెప్పారు. కొడంగల్‌లో దళిత, గిరిజన, బహుజన భూములు గుంజుకొని అక్కర్లేని ఫార్మా విలేజ్‌ను రుద్దుతున్నారని.. వారికోసం పోరాటం చేయండని చెబుతూ బాధపడుతున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డి జైలు నుంచి చర్లపల్లి జైలు వరకు తప్పు చేయని అమాయకులు జైల్లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. కానీ కొడంగల్ నుంచి కొండారెడ్డి పల్లె వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారని మండిపడ్డారు. కొడంగల్‌లో అర్ధరాత్రి పూట ఇళ్లపై పడి మహిళలు, పిల్లలపై అరాచకాలు చేస్తూ పేద రైతుల భూములు గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ 85 ఏళ్ల సాయిరెడ్డి అనే వ్యక్తిపై పగబట్టారన్నారు. రేవంత్ రెడ్డి కోసం ఆయన మొన్నటి ఎన్నికల్లో పనిచేశారని.. కానీ ఆయన ఇంటికి అడ్డంగా గోడకట్టి తోవ లేకుండా చేశారని చెప్పారు. ఆ క్షోభ, అవమానంతో సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. నియంతలు, దుర్మార్గుల పాలనలోనే ఇలాంటి సంఘటనలు చూస్తుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మేము అధికారంలో ఉన్నామని.. ఎప్పుడైనా ఇలాంటి ఘటనల గురించి విన్నామా అని ప్రశ్నించారు. సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నీ సామ్రాజ్యమా, నువ్వు చక్రవర్తివా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వెయ్యి ఏళ్లు బతకటానికి ఏమైనా వచ్చావా అని వ్యాఖ్యానించారు. సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నేను ఆడింది ఆట, పాడింది పాట అంటే కుదరదని స్పష్టం చేశారు. నువ్వు నియంత కాదు.. చక్రవర్తి కాదు.. నీలాంటి వాళ్లు చాలా మంది కొట్టుకుపోయారు. నువ్వు కూడా కొట్టుకుపోతావని అన్నారు. శిశుపాలుడి తప్పులను ఆనాడు లెక్కించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు, రేవంత్ రెడ్డి పాపాలను ప్రజలు ఇప్పుడు లెక్కిస్తున్నారని తెలిపారు.
భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరుతో దౌర్జన్యాలు, పేద, గిరిజన రైతుల కుటుంబాల మీద అర్ధరాత్రి బందిపోట్ల మాదిరిగా పోలీసులు దాడి చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉంది కదా అని విచ్చలవిడిగా దౌర్జన్యం చేస్తూ సాయిరెడ్డి, గురువారెడ్డి లాంటి వాళ్లు ఆత్మహత్యలు చేసుకునే విధంగా చేశారని విమర్శించారు. సొంత గ్రామంలో చేస్తున్న అరాచకాల పాపాలు పండే రోజు దగ్గరలోనే ఉందని తెలిపారు. నీ కన్నా పెద్ద పెద్ద నియంతలు కూడా కొట్టుకుపోయారని అన్నారు. మా నేత నరేందర్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నాడని అన్నారు. పేదలు, గిరిజన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరాడని చెప్పారు. మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ చేపట్టనున్న ధర్నా బాగా చేయాలంటూ మాకు ఉత్సాహాన్నిచ్చారని అన్నారు. నరేందర్ రెడ్డికి, చేయని తప్పునకు జైల్లో ఉన్న 30 మంది అమాయక రైతుల కుటుంబాలకు ఒకటే చెబుతున్నాం.. మీరు భయపడాల్సిన అవసరం లేదు.. మీ వెనుక కేసీఆర్ ఉన్నాడు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది.. అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి మిమ్మల్ని నాలుగు రోజులు జైల్లో పెట్టవచ్చు.. కానీ ఆయనకు మళ్లీ రాజకీయ జీవితం లేకుండా చేసే బాధ్యత మీ మీద ఉందని చెప్పారు.

# తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారు

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణలో మహిళలకు రూ.2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా మహారాష్ట్రలో ₹3,000 ఇస్తామనడం, రైతు భరోసా ఎగ్గొట్టడం, ఆసారా దోఖా, రైతు రుణమాఫీ ఏడాది గడుస్తున్నా పూర్తి చేయకపోవడం వంటివి మహారాష్ట్ర లో తీవ్ర ప్రభావం చూపెట్టాయని తెలిపారు. తెలంగాణ ప్రజలు ముంబై, షోలాపూర్, పూణే, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తుండటం వల్ల కాంగ్రెస్ మోసాలు విరివిగా మహారాష్ట్రలో ప్రచారం అయ్యాయి అనేది సుస్పష్టమని హరీశ్‌రావు అన్నారు. ఝార్ఖండ్‌లో విజయం సాధించిన జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్‌కు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. హేమంత్ సోరెన్‌పై బీజేపీ పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీని చీల్చే ప్రయత్నాలను జార్ఖండ్ ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. బీజేపీ కక్ష సాధింపు విధానాలను ప్రజలు హర్షించడం లేదని తేలిపోయిందని పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ సంక్షేమ పథకాలకు, అక్రిడేషన్ కార్డులకు లింకు పెట్టొద్దు

## సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డికి టీ.ఎస్.జే.యూ ఆధ్వర్యంలో వినతి



విశ్వంభర, మహబూబాబాద్: జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జే.యూ) ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డికిసమర్పించిన వినతి పత్రంలో కోరారు. అన్ని జర్నలిస్ట్ యూనియన్లకు అక్రిడేషన్ కమిటీలో భాగస్వామ్యం కల్పించాలని వారు కోరారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్.యూ.జే(ఐ) జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం, టీ.ఎస్.జే.యూ రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపని నాగరాజు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ లు ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇల్లు ఇల్లా స్థలాల సమస్యలను సైతం పరిష్కరిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా టీ.ఎస్.జే.యూ నేతలు మాట్లాడుతూ తెలంగాణలో జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యతని వారు అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు వంటి అనేక సమస్యలను నివారించాలని వారు కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమ పథకాలకు అక్రిడిటేషన్ లింకును తీసివేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్రిడిటేషన్ కార్డులు పొందని అనేక మంది జర్నలిస్టులు తమ వృత్తి సేవలను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక, వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం కమిటీలను నియమించాలని, బాధితులకు న్యాయం అందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కమిటీలను పునరుద్ధరించాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల, స్థలాలు కేటాయించడంలో ప్రస్తుత యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలకు మాత్రమే కాకుండా ప్రభుత్వం స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు (వీరంతా జర్నలిస్టులే) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ చేయాలని వారు కోరారు. తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, చిన్న పత్రికలు, మీడియాకు ఆర్థిక సాయం అందించడానికి ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకం రూపొందించాలని వారు కోరారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నది. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికతో శ్వేత పత్రం విడుదల చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వార్తల సేకరణలో ప్రమాదకర పరిస్థితులు, ఆరోగ్య ప్రమాదాలు, వృత్తి సంబంధిత బెదిరింపులకు గురవుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కాపాడడానికి ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టుల ఆసుపత్రి చికిత్సలు, ప్రమాద బీమా, ఆరోగ్య సంబంధిత సహాయాలు పొంద గలగాలని, జర్నలిస్టుల సురక్షిత భవిష్యత్తు కోసం ఈ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లబ్ధిదారులకు అందజేశారు. ఆరుగురు లబ్ధిదారులకు సుమారు 2 లక్షల 6 వేల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు.ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు అడుప మహేష్, యకంబ్ర చారి, సౌరం అభిలాష్, గ్రామ శాఖ అధ్యక్షులు మాచర్ల స్టాలిన్, గొలుసుల సంతోష్, ఈర్ల రాజేందర్, నర్సింగోజు నరేందర్ చారి, లింగాస్వామి, మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



విశ్వంభర, షాద్ నగర్: షాద్ నగర్ డిప్యూటీ డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ వి విజయలక్ష్మి శనివారం కొందుర్గ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది అందరూ కూడా సమయపాలన పాటించి అందరూ విధులకు హాజరుకావాలని సిబ్బందికి తెలియజేశారు.ఎవరైతే సిబ్బంది సమయపాలన పాటించకపోతే వారిపై తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.సూపర్వైజర్ సిబ్బంది అందరూ కూడా వారికి కేటాయించిన సబ్ సెంటర్లను సందర్శించి ఏఎన్ఎంల మరియు ఆశాల యొక్క పనితీరును పరిశీలించాలని తెలియజేశారు.ఎన్ సీ డీ, అబా క్రియేషన్ కార్డు లను, మీకిచ్చిన టార్గెట్ ను తొందరగా పూర్తి చేయాలని తెలియజేశారు. గర్భవతులకు సరియైన సమయానికి పరీక్షలు నిర్వహించి,వారికి ఐరన్ మాత్రలు తప్పకుండా అందజేయాలని తెలియజేశారు. పుట్టినప్పటినుంచి అయిదు సంవత్సరంలోని పిల్లలందరికీ వ్యాక్సినేషన్లను తప్పకుండా ఇవ్వాలని తెలియజేశారు. ఆన్లైన్ డాటాను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొందుర్గ వైద్యాధికారి అమృత జోసఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాసులు, డీపీఎమ్ఓ వెంకటేశ్వర్లు,సీ హెచ్ ఓ మంజుల వాణి,పీ హెచ్ ఎన్ లుదియా,ఎం పీ హెచ్ ఈ ఓ లు శ్రీనివాస్,అన్వర్ సీనియర్ అసిస్టెంట్ భగవత్, డీఈవో, హెల్త్ అసిస్టెంట్లు రాఘవులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేనావత్ పత్య నాయక్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో కేక్ కట్ చేసి సీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంగలి రఘు, మాజీ ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ సర్పంచులు సోనా శ్రీను నాయక్, అంజి నాయక్, రమేష్ నాయక్, గుత్తి బాలస్వామి,ఎన్. రమేష్ నాయక్, లండం యాదయ్య, భయ్యా దేవేందర్, కొమ్ము ప్రసాద్, వరికుప్పల గణేష్, రాజు, మద్దూర్ యానంద్, ధనరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



విశ్వంభర, భూపాలపల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగదిలో మధ్యాహ్న భోజనం కోసం వండిన వంటకాలను పరిశీలించారు. స్టోర్ రూమ్, డార్మెటరీ హాల్ లను తనిఖీ చేసి అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహార పదార్థాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నదని భవనం అసంపూర్తి నిర్మాణంలో ఉన్నదని సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా జిల్లా విద్యాశాఖ అధికారి తో ఫోన్లో మాట్లాడి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను మరొక భవనంలోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, శీతాకాలం దృష్యా స్నానాలకు వేడి నీటిని అందించేందుకు వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ మాత్రమే అందించారని మరొక జత యూనిఫామ్ అందించాలని డీఈఓను ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరు కావాలని స్పష్టం చేశారు. పాఠశాలలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఏదేని ఆరోగ్య సమస్య వస్తే వెంటనే వైద్య సేవలు అందించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



విశ్వంభర, పూడూరు: పూడూరు మండల పరిధిలోని చింతల్ పల్లి, బాకాపూర్ గ్రామంలో బీటీ రోడ్డు పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి, రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధితో దేశ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో గ్రామ ప్రజలంతా భాగస్వాములు కావాలని, దశలవారీగా గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాసరెడ్డి, మండల పీఏసీఎస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, వెంకట్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో ఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు



విశ్వంభర, హైదరాబాద్: పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్ స్టేషన్ కు చెందిన ఎస్ఐ. ఇద్దరు కానిస్టేబుళ్లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.ఆర్. పవన్ ఓ ప్రైవేట్ భూమికి సంబంధించిన కేసులో నిందితుడి పై ఉన్న కేసు మూసి వేసేందుకు రూ.30 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసి చివరకు రూ.15 వేలు తీసుకునేందుకు అంగీకరించాడు. ఇందుకు మధ్యవర్తులుగా కానిస్టేబుళ్లు సిహెచ్. రామకృష్ణ, బి. సంతోష్ లు వ్యవహరించి చరో 2000 లంచం తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వీరు లంచం తీసుకుంటుండగా ముందస్తుగా బాధితుడు మునీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మాటువేసి దాడులు నిర్వహించారు. ఎస్ఐ వద్ద రూ.15 వేల రూపాయలు ఒక కానిస్టేబుల్ వద్ద రూ 2. వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.

## కంటి శుక్లాలకు ఐక్యత ఫౌండేషన్ భరోసా

### టాస్క్ సీఓఓ రాఘవేందర్ రెడ్డి



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్ పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్లో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ టాస్క్ సీఓఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ పేద ప్రజలకు వైద్య, విద్య, ఉపాధి లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని గత నాలుగు రోజుల నుండి మూడు వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించామని దాదాపు 100 మందికి పైగా కంటి శుక్లాల పరీక్షలు చేయబోతున్నామని ఎటువంటి అపోహలకు తావు లేకుండా ఆపరేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఫౌండేషన్ ద్వారా ఉద్యోగాలు పొంది వృత్తి నిర్వహిస్తున్న యువకులకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. అనంతరం శిబిరానికి వచ్చిన వృద్ధులు, మహిళల కు స్వయంగా కళ్లకు కళ్లద్దాలు తొడిగారు. ఈ శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్, వరప్రసాద్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మైసయ్య చంద్రశేఖర్,అభినవ్ రెడ్డి, మల్లయ్య, నరేందర్ రెడ్డి, రాజశేఖర ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుడి కుటుంబానికి సమ్మయ్య గౌడ్ పరామర్శ



విశ్వంభర, మహబూబాబాద్: జిల్లా కేసముద్రం మండలం అర్పణ పల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కందాల వెంకటయ్య భార్య కందాల ఉపేంద్ర ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఉపేంద్ర భర్త వెంకటయ్యను, కుమారులు రమేష్, శ్రీకాంత్, కుమార్తెలు సుభద్ర, సుగుణ, రజితలను గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం వారి కుటుంబానికి 75 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా కేజీ కేఎస్ రాష్ట్ర సభ్యులు కేసముద్రం మండల కేజీ కేఎస్ అధ్యక్షులు డబ్బులు ఉప్పలయ్య మాట్లాడుతూ ఏ గ్రామం లోనైనా గౌడ కుటుంబాలు ఆపదలో ఉంటే విషయం తెలిసిన వెంటనే సమ్మయ్య గౌడ్ సహాయం అందించి, ప్రతి కుటుంబనికి చేదోడు వాదోడుగా ఉంటున్న సమ్మయ్య గౌడ్ మంచితనాన్ని, అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శలో సమ్మి గౌడ్ వెంట్, ఎర్రం శెట్టి అశోక్,కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, మోదం రాజు,గంధసిరి బుచ్చి రాములు,మాజీ సర్పంచ్ గంధసిరి వెంకన్న,సారయ్య, వెంకటమల్లు, వెంకన్న, సాంబయ్య, శ్రీను, వెంకటాద్రి, యాదగిరి, వెంకన్న, ప్రభాకర్, సుధాకర్, విజేందర్, అశోక్, హరీష్, ఎస్కే జానీ, ఎస్ కే సైదులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలి




విశ్వంభర, భూపాలపల్లి: డిసెంబర్ పద్నాల్గవ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ని సద్వినియోగం చేసుకొని రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులతో లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజల్లో ద్వేష భావాలను తగ్గించి కేసుల్లో రాజీ మార్గాన్ని అలవాటు చేయాలని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని ప్రజల్లో నింపాలని, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పోలీసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీందర్ కుమార్ జన్మదిన వేడుకలు



విశ్వంభర, చింతపల్లి: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు చింతపల్లి మండలం కేంద్రంలో ప్రముఖ వ్యాపార వేత్త, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వరికుప్పల వెంకట్రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి బాణా సంచా కాలుస్తూ స్వీట్స్ పంచుతూ జన్మదిన వేడుకలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బంజారాల ముద్దుబిడ్డ, నిస్వార్థపరుడు, నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా సేవకులు దేవరకొండ మాజీ శాసన సభ్యులు, రవీంద్ర కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను గాలికి వదిలేసిన పంచాయతీ సెక్రెటరీ

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ కాలనీ వాసులు అశోక్ అడ్వకేట్ ఇంటి నుంచి శంకరయ్య ఇంటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక మురికి నీరు రోడ్డుపై, ఇండ్ల మధ్యలో ప్రవహించడంతో పందులు దొర్లి దుర్గంధపు వాసనతో కాలనీ వాసులం ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన రవాణా సౌకర్యం కోసం సీసీ రోడ్డును నిర్మించాలని గతంలో ఎన్నిసార్లు కాలనీవాసులు లెటర్లు ఇచ్చి వేడుకున్నప్పటికీ రామన్నపేట గ్రామపంచాయతీ సెక్రెటరీ మాత్రం చొరవ చూపలేదని అన్నారు. ఇప్పటికైనా తక్షణమే సమస్య ను నేరుగా వెళ్లి పరిశీలించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## పంచాయతీ కార్యదర్శి రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

### కోడి రెక్క రాజేంద్రకుమార్

విశ్వంభర, త్రిపురారం: పంచాయతీ కార్యదర్శులకు రక్షణ కరువైందని నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు కోడి రెక్క రాజేంద్ర కుమార్ అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా వాజేడు మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అందుకోవాలని కోరారు. రమేష్ పోలీసు ఇన్ ఫార్మర్ గా పని చేస్తున్నాడు అనే నెపంతో మావోయిస్టులు చంపడం సరి కాదని అన్నారు. రమేష్ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్రం లో పంచాయతీ కార్యదర్శులకు రక్షణ కరువైందని, ఇటువంటి దాడులు మళ్లీ జరగకుండా చూడాలని అటవీ ప్రాంతంలో పనిచేస్తున్న కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

### జిల్లా పౌరసంబంధాల అధికారి పి.రాజేంద్రప్రసాద్

విశ్వంభర, మహబూబాబాద్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన లబ్దిదారులకు ప్రతి నెల రూ.3000ల చొప్పున పెన్షన్ ను మీడియా అకాడమి ద్వారా అందించడం జరుగుతున్నదని జిల్లా పౌరసంబంధాల అధికారి, పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలు ఈ సంవత్సరం 2024-2025కు సంబంధించిన లైఫ్ సర్టిఫికేట్లను జిల్లా పౌరసంబంధాల కార్యాలయానికి 26 నవంబర్ 2024 లోపు అందజేయవలసిందిగా పి.రాజేంద్రప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.



## 'వికసిత్ భారత్ - యంగ్ లీడర్స్ డైలాగ్' ద్వారా

# ప్రధానితో యువత ముఖాముఖి

విశ్వంభర, భూపాలపల్లి: యువత భాగస్వామ్యం కోసం భారత ప్రభుత్వం ఒక కొత్త వేదికను ప్రారంభించింది. 2025 లో జరిగే నేషనల్ యూత్ ఫెస్టివల్ స్థానంలో 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'ను ప్రారంభించనున్నారు. జాతీయాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించాలన్న ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా దీనిని రూపొందించారు. ఈ సందర్భగా నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా అధికారి అన్వేష్ చింతల మాట్లాడుతూ 2025 జనవరి 11, 12 తేదీల్లో జాతీయ యువజనోత్సవం (నేషనల్ యూత్ ఫెస్టివల్) సందర్భంగా వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జరుగుతుందని కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ ఈ వారం మొదట్లో ప్రకటించినట్లు తెలిపారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 3,000 మంది యువనేతల మధ్య ముఖాముఖి జరగనుంది. వికసిత భారత్ ఛాలెంజ్ అనేది నాలుగంచెల పోటీ. యువత ఇందులో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవచ్చు. యావత్ భారతదేశంతో పాటుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5 వరకు అఖిల భారత డిజిటల్ క్విజ్ పోటీలతో వికసిత భారత్ ఛాలెంజ్ మై భారత్ వెబ్సైట్లో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. మేరా యువభారత్ (ఎంవై భారత్) వేదికగా జరిగే ఈ క్విజ్ లో భారత్ సాధించిన ప్రముఖ విజయాలపై వారి పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ - నేషనల్ యూత్ ఫెస్టివల్, 2025కు సంబంధించిన అన్ని వివరాలూ మేరా యువభారత్ వెబ్ సైట్ (https://mybharat.gov.in/)లో అందుబాటులో ఉంటాయి. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ప్రధాన లక్ష్యాలను ప్రస్తావిస్తూ.. రెండు ప్రధాన లక్ష్యాల ఆధారంగా ఈ యేడు జరిగే కార్యక్రమానికి ప్రణాళికను రూపొందించినట్లు అన్వేష్ చింతల పేర్కొన్నారు. మొదటిది- రాజకీయాల్లోకి కొత్త యువనేతలను తీసుకురావడం. రాజకీయేతర నేపథ్యం ఉన్న లక్ష మంది యువతను ఈ రంగంలో భాగస్వాములను చేయాలని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో గౌరవ ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా దీనిని చేపట్టబోతున్నారు. రెండోది- పారదర్శకమైన, ప్రజాస్వామిక, ప్రతిభ ఆధారిత ఎంపిక విధానం ద్వారా వికసిత భారత్ కోసం యువత అర్థవంతమైన సహకారాన్ని అందించేలా చూడడం. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముఖ్య లక్ష్యాలను వివరిస్తూ.. "యువ ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం, వికసిత భారత్ కోసం వారి ఆలోచనలను పంచుకోవడానికి ఒక వేదికను అందించడం ఈ కార్యక్రమ లక్ష్యం"అని చెప్పారు. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ లో పెద్ద సంఖ్యలో ఈనెల అనగా నవంబర్ 25 నుండి డిసెంబర్ 5 వరకు www.mybharat.gov.in నందు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా యువతకు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి అన్వేష్ చింతల పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి



విశ్వంభర, మహబూబా బాద్: శనివారం మహ బూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల ప్రకారం ఎఫ్ఏక్యూ నామ్స్ అనుసరించి రైతులు శుద్ధి చేసిన ధాన్యం మ్యాచ్చర్ వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే బాగుంటుందని, అందుకు మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కేంద్రం నుండి కొనుగోల్లు చేసిన ఆరు లారీల ధాన్యాన్ని తరలించడం జరిగిందని, రైతులు పూర్తిగా నిబంధనలు పాటిస్తు, అధికారులకు సహకరించి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందని, రైతులకు కొనుగోలు కేంద్రాల వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ వెంట డీఎస్ఓ ప్రేమ్ కుమార్, ఏపీఎం తదితరులు ఉన్నారు.

## తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గిరిజన జర్నలిస్టులకు శిక్షణా తరగతులు



విశ్వంభర, మహబూబాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలలో గల గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు డిసెంబర్ మాసంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా పౌర సంబంధాల అధికారి పి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కావున జిల్లాలోని ఆసక్తి గల గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు శిక్షణా తరగతులకు హాజరుకావడానికి తమ పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయాలలో నమోదు చేయించు కోవాల్సిందిగా పి.రాజేంద్రప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న 18 నెలల బాబు

- వైద్య ఖర్చులకు రూ. 20,000 లు నగదు సహాయం
- అందజేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి



విశ్వంభర, మెట్ పల్లి: కోరుట్ల పట్టణానికి చెందిన వీరమల్ల ప్రసాద్ యొక్క 18 నెలల మనుమడు బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న విషయాన్ని సామాజిక మధ్యమాల ద్వారా తెలుసు కున్న జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి తన మనుమడు మనుమరాలు (కవలలు) ఆర్యన్ కృష్ణ, అరణ్యా ల పుట్టినరోజు సందర్భంగా 20 వేల నగదు సహాయాన్ని అందించారు. మెట్ పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు సంతోషిని, రాంబాబు ఆర్యన్ కృష్ణ, అరణ్య ల పుట్టినరోజు సందర్భంగా మిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ లోని అనాథ పిల్లలకు బెడ్ షీట్లు, స్వేటర్లు, పెన్నులు, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో మైలారపు లింబాద్రి కుటుంబ సభ్యులు మిచ్చమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు మెట్ పల్లి ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డినీ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సెక్రటరీ కొదుమూరి దయాకర్ రావు ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విశ్వంభర, హైద్రాబాద్

## గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం



విశ్వంభర, ఆమనగల్లు: గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆమనగల్ లోని బస్టాండ్, పోస్ట్ ఆఫీస్, మండల వనరుల కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం నందు వివిధ ప్రదేశాల వద్ద ఐదు సిమెంట్ కాంక్రీట్ బెంచీలను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రైమరీ పాఠశాల యందు విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పరీక్షలలో ఉపయోగించుకొనేందుకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా వివిధ జిల్లాలలో ప్రభుత్వ పాఠశాల లోని విద్యార్థులకు వివిధ రకాల సౌకర్యాల కొరకు, వారి విద్యాభివృద్ధికి పాటుపడడం, విద్యార్థులలో విలువలు, సేవా భావం వికసింప చేయడానికి కృషి చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఉపాధ్యాయులు విజయభాస్కర్, గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,సాయిబాబు, శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కుటుంబం



విశ్వంభర, మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో సారా గంగారెడ్డి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా ఇంటిలో ఉన్న వస్తువులు అన్ని ఖాళీ బూడిద అయ్యాయి. ఇంటిలో విలువైన వస్తువుల తో పాటు నగదు మొత్తం కాలిపోయింది. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని బాధితులు రోధిస్తున్న సంఘటన చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇల్లు మొత్తం ఖాళీ బూడిద అయిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం జరగ నందున గ్రామస్తులు ఊపిరి తీసుకున్నారు. మంటలార్పిన మెట్ పల్లి ఫైర్ సిబ్బంది సంఘటనపై దర్యాప్తు జరిపి నష్టం విలువ అంచెన వేస్తామని తెలిపారు.


## వృత్తి నైపుణ్య శిక్షణ త్వరలో ప్రారంభం

### ఎంపీడీవో కుసుమ మాధురి



విశ్వంభర, ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలో యూనియన్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, స్వర్ణ భారత్ ట్రస్ట్, జి.యం. ఆర్. వరలక్ష్మీ ఫౌండేషన్, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో వృత్తి నైపుణ్య కోర్సులు త్వరలో ప్రారంభించ బడుచున్నవని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలియజేశారు. ఆసక్తిగల గ్రామీణ ప్రాంత అభ్యర్థులు మాత్రమే శిక్షణ కేంద్రంలో వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని వారి పేర్లను శిక్షణ కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. టైలరింగ్, బ్యూటిషియన్ మగ్గం వర్క్, పాడి పరిశ్రమ, వర్మి కంపోస్టు, సి.సి. కెమెర టెక్నీషియన్, ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫి, జూట్ బ్యాగ్ల తయారి, ఇమిటేషన్ జ్యువెల్లరి, సెల్ఫోన్ రీపేర్, పచ్చళ్ళు, కారంపొడులు, మసాల ధినుసుల తయారి కొవ్వత్తులు/ ఆగర బత్తుల తయారి, పుట్టగొడుగుల పెంపకం, టూ వీలర్ టెక్నీషియన్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్ మేకల పెంపకం, కోర్సులలో చేరేవారు పది రోజుల నుండి 30 రోజుల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని వయో పరిమితి 19 సం.ల నుండి 45 సం.ల వరకు ఉన్నవారు అర్హులని భోజన వసతి కూడా ఉంటుందని ఆమె తెలిపారు. ఆమనగల్లు మండల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే కసిరెడ్డి ఘనంగా నివాళులు



విశ్వంభర, కల్వకుర్తి: నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయి రెడ్డి శుక్రవారం ఆత్మహత్య చేసుకోవడంతో మృత దేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రిలో మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు సతీశ్ తండ్రి 6వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి భర్త బుచ్చయ్య తెల్లవారుజామున చనిపోయిన విషయం తెలిసి ఆయన మృత దేహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ఆనంద్ కుమార్, భూపతి రెడ్డి, సంజీవ్ యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారి





విశ్వంభర, వంగూర్: నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో శనివారం మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సర్వారెడ్డిపల్లి, గాజర, నిజాంబద్ గ్రామాలను సందర్శించి వరి కొయ్యాలను కాల్చడం ద్వారా జరిగే నష్టాలను రైతులకి వివరిచండం జరిగింది. అలాగే నిజాంబద్ గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిల్ కుమార్, ఏఈఓ జైపాల్, గ్రామ రైతులు భారత్ భూషణ్ రావు, వేంకటేశ్వర రావు, దాసరి రవి, అంజల్ రావు, రాజీ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలి



విశ్వంభర, కూత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రారంభించి మొదటి సంవత్సరం విజయవంతంగా పూర్తవుతున్న సందర్భంగా ప్రజపాలన విజయోత్సవాల సన్నాహక సమావేశం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్తూ ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. అదే విధంగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి,మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ బొంగునూరీ ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మీ, ఐ.ఎన్.టీ.యూ.సీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, సీనియర్ నాయకులు అవిజే జేమ్స్,దమ్మని శ్రవణ్ కుమార్, గూడ ఐలయ్య గౌడ్, లక్ష్మా రెడ్డి, బొడ్డు వేంకటేశ్వర రావు, పాల కృష్ణ, రషీద్ బేగ్, ఫలహ్ ఉర్ రహ్మాన్, మైసిగారి శ్రీనివాస్ మరియు డివిజన్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు, ఐ.ఎన్.టీ.యూ.సీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



విశ్వంభర, మహ బూబాబాద్: మరిపెడ మండలం లోని వీరారం, ఎల్లంపేట గ్రామంలో, చిన్నగూడూరు మండలం లోని చిన్న గూడూరు, గుండం రాజు పల్లి, జయ్యారం, మన్నెగూడెం గ్రామంలో, కొరవి మండలంలోని నేరడ, తట్టుపల్లి, సూధన పెల్లి, గ్రామా లు, సీరోలు మండలంలోనీ సీరోలు, కాంపెల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీ పథకాలు పూర్తిగా అమలు చేస్తున్నామని రైతు లెవరు అధైర్య పడద్దని, ముందుగా పార్టీ కోసం ఎన్నికల ముందు కష్టపడ్డ వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇద్దామని తర్వాత మనం తీసుకుందామని, ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ వాళ్ళ మాటలు నమ్మవద్దని దళారుల మాటలు నమ్మి మోసపోకండి అని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జీలు, అధ్యక్షులు, కార్యదర్శులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ



విశ్వంభర, కల్వకుర్తి: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరమణ తెలిపారు. కల్వకుర్తి మండలం మార్చాల జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వెంకటరమణను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నిక పట్ల ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, నాణ్యమైన విద్యను అందించుటకు సమాజానికి ప్రభుత్వ పాఠశాలపై గౌరవం కలిగేటట్లు కృషి చేస్తానని వెంకటరమణ తెలిపారు.

## ప్రతి ఇంటికి ప్రజా పాలన పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు

### ప్రజా పాలన పథకాలపై ఇంటింటికి కళా జాత ప్రదర్శన



విశ్వంభర, హుజూర్ నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గోపాల పురం, బూరుగడ్డ గ్రామాలలో ప్రతి ఇంటికి ప్రజా పాలన పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీమ్ లీడర్ వేముల శ్రవణ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మరియు సమాచార పౌర సంబంధాల అధికారి ఆదేశాల ప్రకారం జిల్లా లోని ప్రతి గ్రామంలో కళా జాత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 6 గ్యారంటీలలో ఒకటైన ఉచిత బస్ పథకంలో భాగంగా ఫ్రీగా బస్ ప్రయాణం చేసే ప్రతి మహిళ కళ్ళలో ఆనందం కనబడుతుందని అన్నారు. ప్రతి మహిళకు రూ. 500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను అందించడం జరుగుతుందని అర్హులైన పేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని, రైతు భరోసా పేరుతో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరుగుతుందని వివరించారు. గృహ జ్యోతి పథకంతో ప్రతి ఇంటికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ యూనివర్సిటితో రెసిడెన్షియల్ పాఠశాలలు అనుసంధానం చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ పథకాలు అందుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళా కారులు గంట భిక్షపతి, పల్లెల లక్ష్మణ్, కుందమల్ల నాగలక్ష్మి, ఒంటెపాక ప్రియంక,నెమ్మాది స్రవంతి, మేడి ప్రియదర్శిని,మేడి ఇందిర లతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు గిరిజ,ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు



విశ్వంభర, మహబూబాబాద్: ప్రతి ఏటా డిసెంబర్ మూడో తారీఖున అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించే క్రమంలో శనివారం మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఎన్.టి.ఆర్. స్టేడియం నందు జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలను జిల్లా సంక్షేమ అధికారి శిరీష ప్రారంభించి నిర్వహించారు.

# ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మళ్లా మోసం చేసిండ్రు

**. పత్రాలచ్చి ఏడాదైనా వాటి ఊసే ఎత్తడం లేదు . విజయోత్సవాలు ఎందుకు చేస్తుండ్రో ప్రజలకు చెప్పాలే . మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

విశ్వంభర, భూపాలపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇందరమ్మ ఇండ్లు మంజూరీ చేస్తామని చెప్పి మోసం చేశారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో బాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో నిరసన కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయంటూ ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపినీ కోసం కోట్లు వెచ్చించి బారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి పత్రాలు పంపిణీ చేశారే కానీ ఏడాది గడుస్తున్నా ఇంటి స్థలాలు, రూ.5లక్షలు ఒక్కరికి కూడా మంజూరీ చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తూనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఏమీ చేయలేందంటూ విషప్రచారం చేస్తున్నారని, గత ప్రభుత్వంలో మహాముత్తారం మండలం కోనంపేట గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలకు 78 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరీ చేసి 73 ఇండ్లుపూర్తి చేసి ఇచ్చామని, హైదరాబాద్ నుంచి 500 కిలోమీటర్ల దూరంలోని ఓ మారుమూల మండలంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు



నిర్మించి ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ సర్కార్‌దేనన్నారు. అధికారం కోసం ఆరు గ్యారెంటీ పథకాలు చెప్పి వంద రోజుల్లో అమలు చేస్తామని హామీలు ఇచ్చారని ఏడాది కావస్తున్నా ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన గ్యారెంటీ పథకాలతోపాటు 420 హామీల్లో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు చేశామని నిరూపిస్తే తాము కండువాలు తీసి కాంగ్రెస్ సంబరాల్లో పాల్గొంటామని ఆయన సవాల్ చేశారు. ఇందిరమ్మ పథకం పేరుతో ఇటు ఉద్యమకారులను, అటు తెలంగాణ ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్‌సర్కార్‌కే దక్కుతుందని విమర్శించారు. మానీఫెస్టో కమిటి ఛైర్మన్‌గా 420 హామీలకు రూపకల్పన చేశామని గొప్పలు చెప్పుకునే మంథని ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని అన్నారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందుకేనా విజయోత్సవ సంబరాలు నిర్వహించుకుంటున్నారని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలోని పోలీస్ అధికారులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పని చేస్తున్నారని, పార్టీ కండువాలు కప్పుకుని పని చేస్తే భవిష్యత్ ఉండదని ఆయన హితవు పలికారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, రౌడీలుగా చిత్రీకరించడం అలవాటుగా మారిందని, అలాంటి కేసులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని మహారాష్ట్ర ప్రజలు ఛీదరించుకుని కనీసం ప్రతిపక్ష హెూదా కూడా లేకుండా చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై కాంగ్రెస్ ప్రజావంచన దినాలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## గాంధీభవన్‌లో ప్రియాంకా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం

**పాల్గొన్న వి. హనుమంతరావు, మెట్టు సాయి కుమార్**




విశ్వంభర, హైదరాబాద్ : వయనాడ్ లోక్ సభ నుండి ప్రియాంకా గాంధీ అత్యధిక మెజార్టీ తో గెలిచిన సందర్భంగా గాంధీభవన్లో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వి హెచ్ మాట్లాడుతూ ప్రియాంకా గాంధీ వయనాడ్ ఉపఎన్నికల్లో 4లక్షల మెజారిటీ తో గెలిచి ఇందిరా గాంధీ మనుమరాలుగా చరిత్ర సృష్టించిందన్నారు. మొదటి సారి పార్లమెంట్ లో అడుగు పెడుతున్న ప్రియాంక గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ప్రియాయంకా గాంధీని ఆదరిస్తున్నారని, యావత్ భారత దేశం మొత్తం ప్రియాంక గాంధీ తిరిగితే కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో కి వస్తుందన్నారు. ఇక అక్కా, తమ్ముడు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొస్తారని ఈ సందర్భంగా ఆయన ఆశభావం వ్యక్తం చేసారు. మహారాష్ట్రలో డబ్బుల ప్రభావంతో బీజేపీ గెలిచిందన్నారు. మహా రాష్ట్ర ఎన్నికల గెలుపు, మోడీ, అమిత్ షా లది కాదని, మహారాష్ట్ర గెలుపు అదాని, అంబానీ ల గెలుపు అని వి హెచ్ పేర్కొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత



విశ్వంభర, చార్మినార్: దారుసిఫా అంధ బాలుర పాఠశాలలో సగౌర చారిటబుల్ సొసైటీ వారిచే విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సగౌర చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ, మెంబర్ డాక్టర్ సూర్య ప్రకాష్, దాత అయినటువంటి డాక్టర్ ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాంలు అందచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అన్ని అవకాశాలని వినియోగించుకుని ఉన్నత స్థానంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యములు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వే డేటా ఆన్లైన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



విశ్వంభర, భూపాలపల్లి: సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే డేటా ఆన్లైన్ చేయు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసి కార్యాలయం నుండి ఆన్లైన్ ప్రక్రియ నిర్వహణపైరెవెన్యూ, పంచాయితీ రాజ్, ప్రణాళిక, మండల, మున్సిపల్ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి అవుతుందని తెలిపారు. సర్వే ప్రక్రియను విజయవతంగా పూర్తి చేయడం పట్ల సిబ్బందిని, సహకరించిన ప్రజలను అభినందించారు. అదే స్ఫూర్తితో డేటా నమోదును ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని, ఏ చిన్న పొరపాటుకు తావు ఉండకూడదని కలెక్టర్ సూచించారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రణాళిక శాఖ సమన్వయంతో డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలన్నారు. సర్వే డేటా నమోదు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేయాలని, ఇందుకోసం 619 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు ను నియమించినట్లు తెలిపారు. అవసరమైన కంప్యూటర్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. డేటా నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని, ఏదేని సమస్య వస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే డేటా భవిష్యత్తులో జిల్లా అభివృద్ధి కోసం కీలకమవుతుందని, అందువల్ల చాలా జాగ్రత్తగా ఆన్లైన్ చేయాలని తెలిపారు. సమాచారం పూర్తిగా అత్యంత గోప్యతగా ఉంచాలని, నమోదు కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించొద్దని సూచించారు. ఆన్లైన్ చేసిన ఫారాలను ట్రంక్ బ్యాక్స్ ల్లో భద్రపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, సీపీఓ బాబూరావు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం, రైతుల సంబురాలు



విశ్వంభర, వరంగల్: వరంగల్ జిల్లా రెండో డివిజన్ వంగపహాడ్ గ్రామంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలో భాగంగా సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500ల బోనస్ ప్రతీ రైతుకు తమ బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ పొలం అనిల్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టు కొన్న రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ రైతులు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉన్నారని, రేవంత్ సర్కారే రైతుల పక్షాన అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమం కిసాన్ సెల్ అధ్యక్షులు ఇంజపూరి రాము, సముద్రాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నలుబోల రవీందర్, డివిజన్ అధ్యక్షులు పొన్నాల రఘు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పోలం అనిల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్, పీఏసీఎస్ అధ్యక్షులు మేరుగు రాజేష్, గండు అశోక్, దోమ కుమార్ వాసాల వంశీ, అరికిల లెనిన్, గ్రామ రైతులు, పార్టీ సీనియర్ నాయకులు, తదితర కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో కార్తీక మాస వనభోజనాలు



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లోని ఆది ముక్తేశ్వర ఆలయం వద్ద కాళేశ్వరం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస మన భోజనాలు నిర్వహించారు. ముందు రోజు రాత్రి చంద్రశేఖర ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించి, మరునాడు ఆదిముక్టేశ్వర స్వామి ఆలయంలో అభిషేకము, అన్న పూజ, వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీజీపీ చేతుల మీదుగా రివార్డ్స్ అందుకున్న పోలీస్ అధికారులు



విశ్వంభర, మహబూబాబాద్: ఈరోజు తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన రివార్డ్ మేళాలో రాష్ట్రావ్యాప్తంగా గంజాయి కేసులలో ఎక్కువ కన్విక్షన్స్(నేరారోపణలు) మహబూబాబాద్ జిల్లా కు వచ్చినందుకు గాను తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ (ఐపీఎస్) చేతులమిదిగా రివార్డ్స్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ (ఐపీఎస్) మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా లో గంజాయి కేసులకు సంబంధించి ఎక్కువ కన్విక్షన్స్ రావడం అభినందనీయం అని అన్నారు. ఒక కేసులో దొషికి శిక్ష పడాలి అంటే కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ నుండి స్టేషన్ అధికారుల వరకు సాక్షులను ప్రవేశపెట్టడంలో, దర్యాప్తు చేయడంలో ఎంతో శ్రమపడాల్సి ఉంటుంది అన్నారు. గంజాయి కేసులలో కన్విక్షన్స్ రావడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బంది అధికారులకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, మరిపెడ ఎస్.ఐ సతీష్, బయ్యారం ఎస్.ఐ తిరుపతి తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతులమిదిగా రివార్డ్స్ అందుకున్నారు.

## కాళేశ్వరంలో భక్తుల రద్దీ



విశ్వంభర, భూపాలపల్లి: కార్తీక మాస శనివారం సందర్భంగా భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వర ఆలయం లో భక్తుల సందడి నెలకొంది. శనివారం సందర్భంగా భక్తులు నవగ్రహ, శని పూజలు నిర్వహించారు. కార్తీక మాస సందర్భంగా గోదావరిలో స్నానమాచరించిన భక్తులు ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ఆ తర్వాత ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగించి బ్రాహ్మణులకు దీప దానాలు అందజేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాల అందజేశారు. ఆయన వెంట కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ ఛైర్మన్ యాట గీతకు సన్మానం



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్లు మార్కెట్ ఛైర్మన్ యాట గీత నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్ గీత ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటు పడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట గీత నర్సింహ మార్కెట్ ఛైర్మన్ పదవి రావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ పవన్ మహేందర్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ళ పంపిణీ



విశ్వంభర, మహేశ్వరం: కందుకూర్ మండలం దన్నారం గ్రామానికి చెందిన దివ్యంగుడు కొంగర సతయ్య గత కొన్నిరోజుల ముందు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి నాకు ఒక కాలు లేనందున కర్రల సహాయంతో నవడం కష్టంగా ఉందని, మూడు చక్రాల వాహనం ఇప్పించాలని కోరాడు. మానవతా దృక్పథంతో ఆలోచించిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందించి ముదు చక్రాల వాహనం అందజేశారు. సబితా ఇంద్రారెడ్డి కి ఎల్లప్పుడు ఋణపడి ఉంటానని దివ్యంగుడు కొంగర సత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిట్టల పాండు, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మహేశ్వరం పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టి-శాట్ ను సందర్శించిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ శాసన మండలి సభ్యులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శనివారం టి-సాట్ ను సందర్శించారు. సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు టి-సాట్ కార్యాలయాన్ని సందర్శించిన మహేష్ కుమార్ గౌడ్ కార్యాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సీఈవో వేణుగోపాల్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా తొలి సారి టి-సాట్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ను సీఈవో వేణుగోపాల్ రెడ్డి ఘనంగా సత్కరించి, సన్మానించారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాలను సీఈవో తో కలిసి పరిశీలించారు. టి-సాట్ పనితీరుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా టి-సాట్ నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా అవసరమై సహకారాన్ని అందించేందుకు సహకరిస్తానని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు.

## ప్రతీ వారం అభివృద్ధి కార్యక్రమాలపై రివ్యూ అందించాలి



విశ్వంభర, మిర్యాలగూడ: మిర్యాలగూడ ఎమ్మెల్యే శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రతీ వారం అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో భాగంగా శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్, నేషనల్ హైవే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో విఫలమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ, అలాగే రోడ్స్ విస్తరణ, ప్రధాన రహదారుల మరమ్మత్తు పనులు, లైటింగ్ ఏర్పాట్లపై ప్రతీ వారం పూర్తై పనులపై రివ్యూ అందజేయాలని సూచించారు. పనులు ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీఎల్ఆర్ బ్రదర్స్, అధికారులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయం




విశ్వంభర, చేవెళ్ల : 2028 లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని బీజేపీ యువ నాయకులు డాక్టర్ మల్ గారి వైభవ్ రెడ్డి అన్నారు. బీజేపీ ఖాతాలోకి మరో రాష్ట్రం చేరిందని అన్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ నేతలు చేవెళ్ల ప్రాంతంలో భారీ ఎత్తున టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, అనంతరెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కుంచం శ్రీనివాస్, రాములు, అశోక్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి సత్యనారాయణ, మాణిక్య రెడ్డి, సురేష్, ఇంద్రసేనారెడ్డి, శంకర్ గౌడ్, కృష్ణ గౌడ్, శర్వా లింగం, ప్రతాప్ రెడ్డి, వసుదేవ్ కన్నా, శేఖర్ రెడ్డి, అశోక్, శీను, జయసింహారెడ్డి, నల్ల నవీన్, వెంకటేష్, కృష్ణ, మనోహర్, శ్రీను, శర్వలింగం, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులను ఒక్కో టీచర్ దత్తత తీసుకోవాలి

**జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి**



విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు ను ప్రతిరోజు నమోదు చేయాలని, విద్యార్థులందరికీ ఎపీఏఏఆర్ కార్డు జెనరేట్ చేయాలని తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులను ప్రతి ఒక్క టీచరు దత్తత తీసుకొని, ఆ లిస్ట్ ను వెంటనే జిల్లా కార్యాలయమునకు పంపించాలని ఆదేశించారు. ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 100% ఫలితాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

## కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై నజర్ నహీ...?

విశ్వంభర, నాగారం: ఒక పక్క జర్నలిస్టులమని చెబుతూ మరోపక్క ప్రభుత్వ ఆఫీసుల్లో తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతున్నా మండల ఉన్నత అధికారులు పట్టించుకోవడంలేదని వార్తలు వినిపిస్తున్నాయి. జర్నలిస్టులుగా బాధ్యతలు ఉంటే మంచిదే గాని ప్రతి పనిలో జోక్యం చేసుకుంటూ తమను కలిస్తే పని అయిపోతుందని ధోరణిలో కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనీ ప్రజలు వాపోతున్నారు. ఇదంతా చూసిన రెగ్యులర్ ఉద్యోగులు ఎలాంటి హెూదా లేకుండా పొరుగు సేవల ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకు భయపడాల్సి వస్తుందని మనోవేదనకు గురవుతున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు అని విశ్వసనీయ సమాచారం. జర్నలిస్టుగా చెప్పుకుంటే తమకు ఏ అభ్యంతరం లేదుగానీ ప్రభుత్వ యంత్రాంగంలో వారి ఆధిపత్యం పై మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం ఇప్పటికైనా సంబంధిత వివిధ శాఖల మండల ఉన్నత అధికారులు జిల్లా అధికారులు కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై దృష్టి సారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వాటర్ ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన



విశ్వంభర, పరిగి: పరిగి మున్సిపాలిటీ పరిధిలోని అమృత్ నిధులతో 14 లక్షల లీటర్ల కెపాసిటీతో మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి మున్సిపల్ ఛైర్మన్ అశోక్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిగి మున్సిపాలిటీ లోని పలు వార్డుల్లో త్వరలోనే మంచినీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు కృష్ణ, మీర్ తాహేర్ అలీ, పురపాలక అధికారులు సంపత్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలుపు పట్ల హర్షం



విశ్వంభర పెద్ద శంకరంపేట: మహారాష్ట్ర ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల పెద్ద శంకరంపేట మండలం బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం పెద్ద శంకరంపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. బీజేపీ కూటముతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి మంచి ఫలితాలు సాధించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు బండల శ్రావణ్ కుమార్. మంగలి కృష్ణ, బీజేపీ నాయకులు, ఎర్ర శ్రీహరి, అంజన్న, రాజు, సాయికుమార్, భూమేశ్వర్, వెంకయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బీసీల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా: చల్లా భరత్



విశ్వంభర, తెలంగాణ బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శ్రీనువాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్ కుమార్ హాజరయ్యారు. వారిరువురి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా చల్లా భరత్ ను నియమించడం జరిగింది. నాపై నమ్మకం ఉంచి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు చల్ల భరత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు కు ధన్యవాదములు తెలిపారు. బీసీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చల్లా భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, మహేష్, నిఖిల్, శివ, రవి, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాగ్ ఫిల్లింగ్ కవర్లు అందజేసిన ఏపీఓ



విశ్వంభర, ఆత్మ కూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శని వారం గ్రామాల్లో 2025–2026 సంవత్సరానికి సంబంధించిన మొక్కల పెంపకం కోసం నర్సరీలకు బ్యాగ్ ఫిల్లింగ్ కవర్స్ ను ఉపాధి హామీ ఏపీఓ బి రమేష్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ ఎస్ శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు ఎ మల్లేష్, డి శ్రీశైలం, జె యాదిరెడ్డి, డి నిర్మల మరియు క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కరుణాకర్



విశ్వంభర, షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన టి. కరుణాకర్ షాద్ నగర్ పట్టణంలో చైతన్య జూనియర్ కాలేజి లో లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. అంతే కాదు చైతన్య జూనియర్ కాలేజీ, విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ లలో డైరెక్టర్ గా ఉన్నారు. కరుణాకర్ అన్న కీ.శే. టి శంకర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీఏసీఎస్ ఛైర్మన్ గా పనిచేసారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా టీజేఏసీ నేతగా షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా స్థానిక ఎమ్మెల్యే ఒక ఉద్యమ కారున్ని నియమించటం పట్ల ఉద్యమ కారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ముందు కూడా ఉద్యమ కారులకు మొదట అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

# చలి కాలం జాగ్రతలు పాటించాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ జీ మురళీధర్



విశ్వంభర, మహబూబాబాద్: చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి వేళ పొగ మంచుతో కూడిన గాలులు వీస్తున్నాయి. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జీ మురళీధర్ తెలిపారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదముందని, ఈ నేపథ్యంలో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎందుకంటే వారిలో రోగ నిరోదక శక్తి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

**చలికాలంలో వచ్చే వ్యాధులు:** చలి కారణంగా జ్వరం వంటిపై దద్దుర్లు రావచ్చు. దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు నొప్పి, తుమ్ములు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి లక్షణాలు ఉన్న చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉందని, గాలిద్వారా సూక్ష్మ జీవులు శరీరంలో ప్రవేశించి తెల్ల రక్తకణాలను నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని కాబట్టి ప్రజలు క్రింద తెలిపిన జాగ్రతలు పాటించాలని తెలిపారు. చిన్న పిల్లలు వెచ్చగా ఉండటానికి స్వెటర్లు వేసి చెవులకు వెచ్చదనం కోసం టోపి పెట్టాలి. వీలైతే కాళ్లకు చేతులకు సాక్సులు, గ్లౌస్ లు వేయాలని నెలల వయసు గల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో పడుకోబెట్టాలని, ఉదయం పూట ఎండలో ఉంచాలని, చిన్నారులతో ఉదయం ప్రయాణాలు చేయొద్దని, పిల్లలకు అవసరమైన అన్ని టీకాలు ఇప్పించాలని, రాత్రి వేళల్లో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు తలుపులు మూసి వేసి వెచ్చదనం కోసం వేడి నిచ్చే హైవోల్టేజీ బల్బులను వేయాలని, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడకూడదని కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, వేడి వేడి ఆహార పదార్థాలను తినిపించాలని, కూల్డ్రింక్స్, ఇతర తినుబండారాలకు దూరంగా ఉంచాలని ఆయన తెలిపారు.

# ఆహారం కల్తీ కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



విశ్వంభర, భూపాలపల్లి: సంక్షేమ వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఆహారం కలుషితం కాకుండా నిరంతర పర్యవేక్షణతో పాటు నాణ్యతను పాటించే లా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను అదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పౌర సరఫరాలు, విద్యా, ఆరోగ్య, గురుకుల, ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ లతో ఆహార నాణ్యతా ప్రమానాలు పాటింపుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన ఆహారం అందించాలని అదేశించారు. ఆహారం కల్తీ కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తనిఖీలు చేపట్టాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడేసియల్ హాస్టల్ లు, ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న భోజన నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశించాలని ఆదేశించారు. బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు నిలువ ఉంచే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, క్రిమి కీటకాలు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆహార పదార్థాలను గోనెసంచులు, కవర్లలో కాకుండా డబ్బాలలో నిల్వ ఉంచాలని, చికెన్, కోడి గుడ్లు, ఉల్లి పాయలు, కూరగాయలు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని స్పష్టం చేశారు. ఆహారం కల్తీ జరిగే సమస్య రాకుండా చూడాలని, ఆహారం కల్తీ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే మండల ప్రత్యేక అధికారులకు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, అంగన్ వాడి కేంద్రాలను తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలో, హాస్టళ్లలను ఖచ్చితంగా తనిఖీలు చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించి విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలు పెట్టాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల రెసిడెన్షియల్ వసతి గృహాలను ప్రత్యేక అధికారులు తనిఖీలు చేపట్టాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలన్నారు. నాణ్యతా లేని ఆహార పదార్థాలు వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మన పిల్లలు మాదిరిగా జాగ్రత్తగా చూడాల్సిందే నని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడీలలో సైతం పాలు, గుడ్లు, పప్పు ఆహార పదార్థాలు నాణ్యత ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డీ డబ్ల్యు ఓ ను ఆదేశించారు. ఆహార తనిఖీ అధికారు లు జిల్లా లోని హాస్టల్స్, పాఠశాలలు, ఆసుపత్రులు తనిఖీ చేసి ఆహారం కల్తీ జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించాలని తెలిపారు. మధ్యాహ్న బోజన కార్మికులకు సైతం నాణ్యమైన వంట వండే విధంగా అవగాహన కల్పించాలని, పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, సంక్షేమ అధికారి చిన్నయ్య, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్, ఆర్ సీఓలు తదితరులు పాల్గొన్నారు.

# రామ్ నామ్ సమాజ్ వారితో అందెల శ్రీరాములు

### ఆచార్య సంప్రదాయాలను అడిగి తెలుసుకున్న అందెల



విశ్వంభర, మహేశ్వరం: హైదరాబాద్ శిల్పారామంలో రెండు రోజులుగా జరుగుతున్నటువంటి లోక్ మంతన్ కార్యక్రమంలో భాగంగా దేశ నలుమూలల నుండి విచ్చేసిన విభిన్న ప్రజల సంస్కృతి సాంప్రదాయాలు, కట్టుబొట్టు సాంప్రదాయాలు ఆకట్టుకుంటున్నాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ రామ్ నామ్ సమాజ్ వారితో కలిసి వారి యొక్క ఆచార సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. రామ్ నామ్ సమాజ్ వారు తమ ఒళ్లంతా రామ నామం తో పచ్చబొట్టు వేయించుకోవడం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమని వారు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రామ్ నామ్ సమాజ వారు శ్రీరామచంద్రునికి అపారమైన భక్తులని వీరు చతిస్గడ్ ప్రాంతంలో నివసిస్తారని, మాంసాహారం, మద్యపానం సేవించకుండా నిష్టగా ఉంటారని వారితో కలవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రవినూతల శశిధర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ సంగ్ పరివార్ నాయకులు, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## డ్వాక్రా గ్రూప్ స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యాపార అవగాహన సదస్సు



విశ్వంభర, మహేశ్వరం మండల్ కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్ లో నాబార్డ్ వారి సహకారంతో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ఉచిత శిక్షణ శిబిరంలో భాగంగా 14వ రోజు వ్యాపార అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడ్డం సుదర్శన్ విచ్చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి ఎలా పొందాలి, తాము నేర్చుకున్న విద్యను ఎలా వినియోగించుకోవాలి, కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ శిక్షణ పొందిన తర్వాత వారు ఎలా వ్యాపారం నిర్మించుకోవాలి, వ్యాపారంలో మెలకువలు దాని గురించి తమ సొంత కృషితో ఎలా సంపాదించుకోవాలనే వాటిపై అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎకనామిక్ డెవలప్మెంట్ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ షేక్ హాజీ బాబా మహేశ్వరం గ్రామం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బంగరిగల్ల పేమలత లాజర్, ట్రైనింగ్ టీచర్ సబితా, స్వయం సహాక సంఘాల మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు.

## కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం



విశ్వంభర, కడ్తాల్: కడ్తాల్ పట్టణ కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్ లో కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధిపై నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలని నియోజకవర్గంలో ఏ ఏ సమస్యలు త్వరగా పూర్తి చేయగలమని, కొత్తగా బడ్జెట్ కేటాయించిన రోడ్లు, పలు అంశాలపై సాంఘిక, సంక్షేమ వైద్య, విద్య, మహిళా సమస్యలపై విద్యావనరుల అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ శాఖ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా నిర్వహించారు. అధికారులు నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించగా పరిష్కారానికి అధికారుల ద్వారా పలు సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఎంఈఓ లు, ఎమ్మార్వోలు, ఎంపీడీవో లు, వివిధ శాఖ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ గోశాలకు పశుగ్రాసం అందజేత



విశ్వంభర, షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ శ్రీ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో గల గోశాలలోని గోవులకు ఒక టాక్టర్ లోడ్ వరిగడ్డిని షాద్ నగర్ పట్టణం చెందిన పి.గోవింద్ రెడ్డి దానం చేశారు. అనంతరం ఆవులను పరిశీలించారు. గో సేవా మహా పుణ్యమని ప్రతి ఒక్కరూ గోవును పూజించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గోవుల కోసం సేవా కార్యక్రమాలు చేయాలని వారు కోరారు. గోవులకు ఒక టాక్టర్ లోడ్ వరిగడ్డిని దానం చేసిన గోవింద్ రెడ్డిని 6వార్డు కౌన్సిలర్ లతా శ్రీ శ్రీశైలం గౌడ్ అభినందించారు.

## స్మశాన వాటిక పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యేకు వినతి



విశ్వంభర, సరూర్ నగర్: సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని కుతుబ్ షాహీ మస్జిద్, గ్రేవ్ యాడ్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డికి సరూర్ నగర్ డివిజన్ వార్డ్ సభ్యులు మొహమ్మద్ జహీర్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటి 80 లక్షల రూపాయలతో కుతుబ్ షాహీ మస్జిద్, గ్రేవ్ యాడ్ లు కొత్త హంగులతో రూపకల్పన చేసే సమయానికి ఎలక్షన్ కోడ్ రావడంతో పని జరగలేదని వెంటనే పనులు మొదలుపెట్టలని సబిత ఇంద్ర రెడ్డికి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించి అధికారులతో మఢ్లాడి వెంటనే పనులు ప్రారంభిచేలా చూస్తాను అని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ రజాక్, మహమ్మద్ జహంగీర్, తతితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



విశ్వంభర, చారకొండ: నాగర్ కర్నూలు జిల్లా ఉమ్మడి వెల్దండ మండల సింగల్ విండో ఛైర్మన్ జూపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం చారకొండ మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత మెగా వైద్య ను నిర్వహించామని తెలిపారు. హైదరాబాదులోని కేర్ ఆస్పత్రికి చెందిన వైద్యులచే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, టూడికో, ఈసీజీ, ఇతరత్రా వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా అక్కడికి వచ్చే ప్రజలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్, జూపల్లి వెంకటయ్య యాదవ్, బలరాం గౌడ్, వెంకట్ గౌడ్, ప్రజలు పాల్గొన్నారు.


## సరూర్ నగర్ స్టేడియంలో స్పోర్ట్స్ లీగ్ ముగింపు వేడుకలు



విశ్వంభర, సరూర్ నగర్: ఎల్ బి నగర్ నారాయణ స్కూల్ దిల్ సుఖ్ నగర్ జోన్ దిల్ సుఖ్ నగర్ కు చెందిన నారాయణ విద్యా సంస్థల 11 బ్రాంచ్ లనందు నిర్వహించిన స్పోర్ట్స్ లీగ్ ముగింపు వేడుకలు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నారాయణ గ్రూప్ స్కూల్స్ జీ ఎం గోపాల్ రెడ్డి, ఏ జీ ఎం హేమెంబర్, ఆర్ ఐ రవి ప్రసాద్ లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. స్పోర్ట్స్ లీగ్ లో కబడ్డీ,కోకో, చెస్, క్యారామ్స్, రనింగ్ రేస్ వంటి క్రీడాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థుల కు బహుమతులు ప్రధానం చేసారు. కోకో గర్ల్స్ లో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎల్ బీ నగర్ నారాయణ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఎ ఒ కరుణాకర్, పీఈటి శ్రీధర్ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎర్ర రాజు పౌండేషన్ సభ్యుల ఔద్యారం

- చదువుకున్న స్కూల్‌కు తమవంతు సహకారం
- అభినందించిన స్కూల్ యాజమాన్యం, గ్రామస్థులు



తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు ఎర్ర రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎర్ర వినయ్, సభ్యులు పౌండేషన్ ఆద్వర్యంలో స్టీల్ వాటర్ క్యాన్ లను శనివారం అందజేశారు. ఎర్ర రాజు పౌండేషన్ సభ్యులు తాము చదువుకున్న స్కూల్ కు తమవంతు సహకారంగా వాటర్ క్యాన్‌లను అందజేసి తమ ఔద్యారం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం స్టీల్ వాటర్ క్యాన్లను అందించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎర్రరాజు ఫౌండేషన్ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ శనివారం సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. వివిధ గ్రామాల నుండి అనారోగ్యముతో హాస్పిటల్ లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 3,20,000 చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు ఒక వరంగా మారిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కరెంటోతు శ్రీనివాస్ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ,ప్రధాన కార్యదర్శి కరెంటో తు బిక్షపతి నాయక్, కార్యదర్శులు ఏపూరి సతీష్, ముద్దంగుల నరసింహ, మాజీ జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి వెంకటేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దోనూరి జైపాల్ రెడ్డి,కత్తుల లక్ష్మయ్య,అంతటి ధనరాజ్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు రతుపల్లి యాదయ్య,పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఏర్పుల సుదర్శన్, రవీందర్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కడి చంద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఉప్పల నాగరాజు, కడారి యశ్వంత్ యాదవ్, సుర్కంటి జనార్దన్ రెడ్డి, కత్తుల మల్లయ్య, బొడ్డుపల్లి బిక్షమయ్య, చిలువేరు నరసింహ, నర్రి ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# సరిలేరు నీకెవ్వరు

కాచం ఓ వ్యక్తి కాదు. ఓ వ్యవస్థ. బతుకు కష్టాలను వడబోసిన సాహసి . సామాజిక సేవకునిగా, ఉద్యమకారునిగా, రాజకీయనాయకునిగా, మీడియా సంస్థల నిర్వాహకునిగా విభిన్న పార్శ్వాలు కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆహ్లాదమైన నవ్వు, నిరాడంబరత్వం, కలుపుగోలుతనాల కలబోత. ఇప్పటివరకు ఏది చేసినా అన్నింటా నిస్వార్థ సేవ, అంకిత భావం, మానవీయ విలువలు, త్యాగాలకే చోటిస్తూ వచ్చారు. భేషజాలనూ, కుహనా పోకడలనూ శుష్క అనుకరుణలను బాహాటంగా వ్యతిరేకిస్తారు.

ఆయనలో ఓ ఉద్యమకారుడు, ఓ పాత్రికేయుడు, ఓ రచయిత, ఓ విమర్శకుడు, ఓ వక్త, ఓ సమన్వయకర్త, ఓ వ్యాఖ్యాత, ఓ అభ్యుదయవాది, ఓ నాయకుడు, ఓ సమాజసేవాపరాయణుడు ఉన్నారు. అన్నింటికన్నా గొప్ప సంస్కారమున్న ఓ మంచి మనిషి ఉన్నారు. ఇలా బహువిధ సామర్థ్యాలను సంతరిచుకున్న కాచం సత్యనారాయణ ఎదుటి వ్యక్తిలో ఉన్న ప్రతిభను కనిపెట్టి వెన్నుతట్టి ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకొని రావడంలో మొనగాడు. ప్రశ్నించడం.. తిరగబడటం.. మనిషి లక్షణం అన్న శ్రీశ్రీ మాటలను నిజంచేసిన వ్యక్తి. కాచం గుంపులో గోవిందంలా కాకుండా గుంపుకే ఊపిరవుతాడు. అతనెక్కడున్నా పదిమంది పెట్టు. యవ్వనపు రోజుల్లో ఇతడికి ఎదురైన అరుదైన అవకాశాలను లక్ష్యం కోసం కాలదన్నినవాడు. లేకపోతే, బహుశా ఎవరూ అందుకోలేనంత ఎత్తులో ఉండేవాడు. నికార్సయిన జీవితానుభవమూ, అధ్యయనమూ, బహుముఖంగా వ్యాపించిన ప్రజా జీవితం తెలిసిన నాయకుడు.




## విద్యార్థి దశ నుంచే పోరాట లక్షణాలు...

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న కాచం, చిన్నవయసుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిపోటీనిచ్చారు. ఇంద్రారెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన కాలేజీ రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రం యొక్క ఆవశ్యకతను అవగాహనకు తెచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2001లో జలదృశ్యంలో నిర్వహించిన టీఆర్ ఎస్ ఆవిర్భావ సదస్సులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, అన్యాక్రాంతం అవుతున్న భూములపై, నిధుల దుర్వినియోగం, నియామకాల్లో వివక్షపై ఉమ్మడి పాలకులను నిగ్గదీయడంతో కేసీఆర్ దృష్టిని ఆకర్షించారు.

## తెలంగాణ ఉద్యమంలో..

తెలంగాణ ఉద్యమ సమయంలో కాచం సేవలు అనన్య సామాన్యం. అద్భుతం. ఉద్యమ సమయంలో వందలాది మంది యువతను, వివిధ రంగాల వారిని చైతన్య పరిచి, సంఘటితపరిచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంవైపు నడిపించాడు.ఎల్బీనగర్ వేదికగా తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చి నిలిచిన పోరుబిడ్డ. తెలంగాణ వాదాన్ని బలంగా తీసుకెళ్లడంలో ముందువరుసలో నిలిచారు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో రచయితలను, కళాకారులను ప్రోత్సహించి వారి రచనలు, ఆట,పాటల ద్వారా తెలంగాణ భావజాలాన్ని వీధి వీధినా చాటిచెప్పారు. ఉద్యమ సమయంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా వ్యయప్రయాసల గురించి ఆలోచించకుండా ముందడుగువేసి ఆయా కార్యక్రమాలను వెన్నుదన్నుగా నిలిచేవారు. ఉద్యమ సమయంలో జరిగిన వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకోలు, రైలురోకోలు, సకల జనుల సమ్మె అనేక నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ముందుండి నడిపించారు. ఉద్యమ సమయంలో తన ప్రియ శిష్యుడు శ్రీకాంతచారి బలిదానం కాచంను కలిచివేసింది. శ్రీకాంతాచారి బలిదానం తర్వాత పార్టీపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటూ వస్తున్నారు. ఉద్యమ సమయంలో ఎన్నోమార్లు లాఠీదెబ్బలు తిన్నారు. నిర్బంధాలు ఎదుర్కొన్నారు.

## ప్రజా సంబంధాలను స్నేహసంబంధాలుగా...

ప్రజా సంబంధాలను స్నేహసంబంధాలుగా మార్చుకోవడమే ఆయన విజయ రహస్యం.హైదరాబాద్ పరిసరప్రాంతాల్లో అనేకమందికి చిరపరిచితుడు. మానవతా వాది. అణగారిన వర్గాలను అక్కున చేర్చుకునే మనసున్న మనిషి. కాచమన్నా అని పిలవడమే తరువాయి. నేనున్నా నంటూ కదిలివచ్చే ఆశా దీపం. ఏపనిచేసినా చిత్తశుద్ధితో చేయడం ఆయన నైజం. దేశం నాకేమిచ్చింది అని కాకుండా దేశం కోసం నేనేమిచ్చాను అని ఆలోచించే మనస్తత్వం. అవకాశాల కోసం ఎదురుచూసే యువతకు కాచం ఒక ఆశ్రయం. శాంతిని కాపాడటం, మానవ హక్కుల పరిరక్షించడం. సమాజ అభివృద్ధికోసం కలిసికట్టుగా పనిచేయడం ఆయన నైజం.

## తాను పుట్టిన కులం కోసం...

తాను ఉద్యమకారుడిగా, సామాజిక సేవకుడిగా ఉన్నా తాను పుట్టిన కులం గురించి ఆలోచిస్తారు కాచం. కుల వివక్ష ఉండకూడదు కానీ.. కులం పట్ల అభిమానం ఉండటంలో తప్పు లేదని బలంగా నమ్ముతాడు. అందుకే వైశ్య వికాస వేదిక అనే సంస్థను స్థాపించి వైశ్యుల అభివృద్ధి కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద వైశ్య విద్యార్థుల కోసం ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. కొంతమందికి ఫీజులు చెల్లిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సాహకాలు ప్రతి ఏడాది అందిస్తుంటారు. వైశ్యులలో ఉత్తమ ఉపాధ్యాయులకు, అధికారులకు ప్రతి ఏడాది పురస్కారాలు అందజేస్తారు. పేదలకు ఆర్థికంగా సహకరిస్తారు. కంచె ఐలయ్య కోమటి కులస్తులకు వ్యతిరేకంగా ఒక పుస్తకాన్ని రాస్తే దాని మీద పోరాటం చేశారు. సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు అని ఐలయ్య రాసిన పుస్తకాన్ని ఖండిస్తూ వైశ్యులు సామాజిక సేవకులు అనే పుస్తకాన్ని రాసి ప్రచురించారు.

## రక్తదానం, వైద్య శిబిరాలు

కాచం ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా కాచం సత్యనారాయణ రక్తదాన, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. యువకులు రక్తదానం చేస్తూ ప్రాణదాతలు కావాలని రక్తదానం వైపు వారిని మోటివేట్ చేస్తారు.



## సామాజిక సేవా రంగంలో..

ఉద్యకారునిగా, రచయితగా, మీడియా ప్రతినిధిగానే కాక కాచం సామాజిక సేవారంగంలో అందెవేసిన చేయి. సామాన్యుడి గొంతు వినిపించేందుకు అనేక సంక్షేమ సంఘాలను నెలకొల్పిన కాచం.. సబ్బండ వర్గాలకు చేరువైన అరుదైన నేతగా గుర్తింపు పొందారు.

## మీడియా ప్రతినిధిగా...

భాషా, సాహిత్యం, జర్నలిజంతోపాటు సమకాలీన రాజకీయ, ఆర్థిక సామాజిక రంగాల్లో విశేష అవగాహన కలిగి ఉన్న కాచం ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, కొందరికి ఉపాధి కల్పించేందుకు సమకాలీన సమస్యలపై పోరాటం, సామాజిక రుగ్మతలను పారదోలటానికి, సమాజ చైతన్యం చేయడానికి 2018లో వీ3 చానల్ మీడియా సంస్థను నెలకొల్పాడు. తాను రాజకీయ పార్టీలో ఉన్నా ఏ రాజకీయ పార్టీ గా అనుబంధంగా వీ 3 ఛానల్ పనిచేయలేదు. సమాజహితమే లక్ష్యంగా పనిచేసింది. తొలుత 50మంది సిబ్బంది, 200మంది రిపోర్టర్లతో ప్రారంభమైన నిర్విరామంగా తెలుగు మీడియా రంగంలో దూసుకెళ్తోంది. ఛానల్ కు అనుబంధంగా 2024 మే నెలలో విశ్వంభర తెలుగు దినపత్రికను ప్రారంభించారు. విశ్వంభర దినపత్రిక సామాజిక అంశాలు, ఆలోచింప చేసే కథనాలు, తాజా వార్తలను ప్రచురిస్తూ ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే తెలుగు పత్రికా రంగంలో దూసుకెళ్లోంది. అంతకుముందు ఆయన విద్యార్థుల కోసం జ్ఞాన ఘని, రాజకీయ అంశాలతో ప్రజాబింబం, వైశ్యవికాస వేదిక పేరుతో ద్వైమాసిక పత్రిక నిర్వహించారు.

## రచయితగా..

కాచంలో మరో కోణం. రచనా వ్యాసాంగం. బడిబాట, తెలంగాణ కరదీపికలు, తెలంగాణ ఆణిముత్యాలు, తెలంగాణ సాయుధ పోరాట వీరులు, ధీర వనితలు అనే పుస్తకాలు రాశారు. సమాచార హక్కు, జర్నలిజం, సమాజసేవ, వైశ్య సంస్థల బాగు కోసం ఆయన పడే తపన అనిర్వచనీయం.

## ఆయన చేసిన సేవలకు అనేక పురస్కారాలు..

తెలంగాణ ఉద్యమమే ఊపిరిగా జనపథమే ప్రాణపదంగా అనేక సామాజిక కార్యక్రమాలు చేసిన కాచంకు అమెరికాకు చెందిన రెండు యూనివర్సిటీలు భాష, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన విశేష కృషికిగానూ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆయన చేసిన సేవలకు గానూ 2017లో నాటి గవర్నర్ నరసింహన్ చేతులమీద బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు.

## టీఆర్ఎస్ నాయకునిగా

తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచి కాచం కేసీఆర్ వెంటనే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక అజెండాగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను గల్లీ గల్లీకి తీసుకెళ్లేందుకు అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోలేదు.ఉద్యమకాలం నాటి పాటలను, తెలంగాణ చరిత్రను, తెలంగాణ భాషా సాంస్కృతిక వైభవాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో కాచం పబ్లికేషన్ ను ఏర్పాటు చేసి, పుస్తకాలు ప్రచురించారు. సాహిత్యం, కళలకు పెద్దపీట వేశారు. స్వయంగా కలంపట్టి తెలంగాణ చరిత్రను, అమరుల, ఉద్యమకారుల చరిత్రను తెలంగాణ వీర వనితలు, తెలంగాణ కరదీపికలు, ఆణిముత్యాలు పేరుతో గ్రంథాలు రచించారు. తెలంగాణ రాష్ట్రసమితి పార్టీ ఆయనకిచ్చిన బాధ్యతలను తూచ తప్పకుండా పాటించేవారు.ఆలోచనల్లో స్పష్టత, చురుకైన కదలికలు, ఉద్యమకాలంలో ఆయన చూపించిన తెగువ ధైర్యం ఎల్బీనగర్ తిరుగులేని తెలంగాణ ఉద్యమ నాయకునిగా నిలబెట్టాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.టీఆర్ఎస్లో యూత్ సెక్రటరీగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కాచం రాష్ట్ర కార్యదర్శిగా, ఎల్బీనగర్ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ఏర్పడ్డాక ఎల్బీనగర్ ఇంచార్జిగా ఉన్న కాచంకు ఎంఎల్ఏ టిక్కెట్ రావాల్సి ఉన్నా.. అనూహ్య పరిస్థితిలో టిక్కెట్ రాలేదు. అయినా పార్టీ కోసం నిత్యం పాటుపడుతూనే ఉంటారు.

## డా.కాచం సత్యనారాయణ

సారథ్యంలో వీ3 న్యూస్ ఛానల్ దినదినాభివృద్ధి చెందుతూ నేడు ఆరవ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా డా.కాచంకు హృదయపూర్వక శుభాకాంక్షలతో..

విశ్వంభర డెస్క్ సిబ్బంది
రావికంటి శ్రీనివాస్ (అసోసియేట్ ఎడిటర్)
పోతుగంటి వెంకటరమణ (న్యూస్ బ్యూరో చీఫ్)
మేడేపల్లి నాగేందర్ (చీఫ్ సబ్ఎడిటర్)
బీమనపల్లి శివ ప్రసాద్ (చీఫ్ సబ్ ఎడిటర్)
రేవూరి మహేందర్ (చీఫ్ డిజైనర్)
డి.రవి వర్మ (సీనియర్ డిజైనర్)
మేడికొండ పరమేష్ (గ్రాఫిక్ డిజైనర్)



# ప్రేక్షకుల మనసులని గెలిచిన అమరన్



ఉలగనాయకన్ కమల్ హాసన్ ప్రజెంట్ చేసిన 'అమరన్' సంచలన విజయం సాధించింది. విడుదలైన 25 రోజుల తర్వాత కూడా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తూ ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుకుంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మేజర్ ముకుంద్ వరదరాజన్ పవర్ ఫుల్ కథను ప్రేమ, త్యాగం, దేశభక్తి ఎలిమెంట్స్ బ్లెండ్ చేస్తూ ప్రేక్షకులుకు గొప్ప అనుభూతిని పంచింది. ఎమోషనల్ కనెక్షన్, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ లతో ఈ సంవత్సరం అద్భుతమైన విజయాలలో ఒకటిగా నిలిచేలా చేసింది.

శివకార్తికేయన్, సాయి పల్లవి ల నటన అమరన్ విజయంలో కీలక పాత్ర పోషించింది, అన్ని వర్గాల నుండి అద్భుతమైన ప్రశంసలను పొందింది. ప్రేమగల కొడుకు, భర్త, తండ్రితో పాటు యుద్ధభూమిలో నాయకుడిగా ఉన్న సైనికుడు ముకుంద్ గా శివకార్తికేయన్ అద్భుతమైన నటన కనబరిచారు. ఈ పాత్రకు జీవం పోయడంలో అతని సామర్థ్యాన్ని ప్రేక్షకులు ప్రశంసించారు. అతని కెరీర్‌లో అత్యుత్తమ పెర్ఫార్మెన్స్ లో ఒకటిగా నిలిచింది. మరోవైపు ముకుంద్ భార్య ఇంధు రెబెక్కా వర్గీస్ పాత్రలో సాయి పల్లవి మరపురాని పాత్రను తెరపైకి తెచ్చారు. ఆమె స్త్రీ యొక్క నిశ్శబ్ద శక్తిని ప్రజెంట్ చేసింది. ఇందుకు పాత్రకు ప్రాణం పోసే సాయి పల్లవి అత్యుత్తమ నటన అందరినీ మెస్మరైజ్ చేసింది.

ఆర్మీ బయోపిక్‌లకు ఇది బెంచ్‌మార్క్‌ను ఎలా సెట్ చేస్తుందనేది అమరన్ని చూడటానికి ప్రత్యేకమైన కారణాలలో ఒకటి. ఈ చిత్రం ఒక సైనికుడి జీవితం త్యాగాలను అచంచలమైన నిజాయితీతో చిత్రీకరించడమే కాకుండా అతని కుటుంబం యొక్క భావోద్వేగ ప్రయాణాన్ని కూడా చిత్రీకరిస్తుంది. ఎమోషనల్ కోర్‌తో హైఆక్టేన్ యాక్షన్‌ని బ్యాలెన్స్ చేయడం ద్వారా, అమరన్ అలాంటి కథలను తెరపై ఎలా చెప్పవచ్చనే దాని కోసం ఒక బెంచ్ మార్క్ సెట్ చేసింది. కశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్‌లోని వాస్తవ స్థానాల్లో చిత్రీకరించాలనే టీం నిర్ణయాన్ని అభినందించాలి. ఇది కథకు సహజత్వాన్ని తీసుకొచ్చింది. వాస్తవికతను తీసుకురావడానికి టీం చాలా సవాళ్ళని ఎదురుకున్నారు. ఇది ఈ కథకు ప్రాణం పోయడంలో అమరన్ టీం అంకితభావం, కృషిని రిఫ్లెక్ట్ చేసింది.

అమరన్ చిత్రాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి M.K స్టాలిన్ ప్రశంసించారు. రజనీకాంత్, సూర్య , జ్యోతిక అందరూ దాని టీంని మెచ్చుకున్నారు. దీని ప్రభావం దక్షిణ భారత దేశంలోని పాఠశాలలకు కూడా చేరుకుంది, ఇక్కడ NCC విద్యార్థుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్‌లు నిర్వహించబడ్డాయి, దాని సాంస్కృతిక, విద్యా ప్రాముఖ్యతను మరింత నొక్కిచెబుతున్నాయి.

కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ మరియు సోనీ పిక్చర్స్ నిర్మించిన అమరన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించడమే కాకుండా థియేటర్ యజమానుల నుండి హై డిమాండ్ కారణంగా OTT విడుదల విండోను పొడిగించిన మొదటి తమిళ చిత్రంగా అరుదైన మైలురాయిని సాధించింది. ఇది అమరన్ కి వున్న అద్భుతమైన ప్రేక్షకాదరణని తెలియజేస్తోంది.

# తాను పక్కనుంటే ప్రపంచాన్ని గెలుస్తా..



తెలుగు స్టార్ హీరోయిన్స్ లిస్ట్‌లో తమన్నా పేరు ఇప్పటికి టాప్‌లోనే ఉంటోంది. ఆమె తెలుగు సినిమాల్లో కనిపించి చాలాకాలం అయినప్పటికి , తమన్నా క్రేజ్ ఏమాత్రం చెక్కు చెదరలేదు. ఇండస్ట్రీకి వచ్చి 19 ఏళ్లు కావస్తోన్న తమన్నాలో ఎటువంటి మార్పు లేదు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో నటించిన తమన్నా ఫుల్ పాపులారిటీని సంపాదించుకుంది. ముఖ్యంగా తమన్నా తెలుగు సినిమాల ద్వారానే బాగా ఫేమస్ అయింది. తెలుగు స్టార్ హీరోల అందరితోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.

తమన్నా ప్రస్తుతం సినిమాల కన్నా వెబ్ సరీస్‌ల్లోనే ఎక్కువుగా నటిస్తోంది. తన తోటి హీరోయిన్లు కాజల్, నయనతార, రకుల్, సమంత వంటి వారంతా పెళ్లి చేసుకోగా, తమన్నా మాత్రం ఇంకా సినిమాల్లో నటిస్తునే ఉంది. అయితే ఈ ఏడాది తమన్నా పెళ్లి చేసుకునే అవకాశం ఉంది.తమన్నా హీరోయిన్ తమన్నా ప్రస్తుతం గాఢమైన ప్రేమలో ఉన్న విషయం అందరికి తెలిసిందే. తమన్నా బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉంది. వీరిద్దరూ చాలా రోజుల నుంచి డేటింగ్‌లో ఉన్నారు.

త్వరలోనే వీరిద్దరు పెళ్లి చేసుకోవడానికి రెడీ అవుతున్నారు. తాజాగా తమన్నా ప్రియుడుపై ఓపెన్ కామెంట్స్ చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మిల్క్ బ్యూటీ తన బాయ్ ఫ్రెండ్ అయిన విజయ్ వర్మ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ..' విజయ్ రాకతో నా లైఫ్ అంతా మారిపోయింది. తను పక్కనుంటే యావత్ ప్రపంచాన్నే గెలవగలను అనిపిస్తుంది. తన నిజాయితీ అంటే నాకిష్టం' అంటూ చెప్పుకొచ్చింది తమన్నా.

ఇక పెళ్లికి ముందే ఇల్లు కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తోంది. తారలంతా ఉండే బాంద్రా ఏరియాలోనే తమన్న-విజయ్ వర్మ కూడా ఉండాలని ఫిక్స్ అయ్యారు. దీని కోసం వాళ్లు కొన్ని ఖరీదైన అపార్ట్ మెంట్స్ లో ఫ్లాట్స్ చూస్తున్నారు. పెళ్లి తర్వాత కొత్త ఫ్లాట్ లోకి మారాలనేది వాళ్ల ఆలోచన. అంతకంటే ముందు తమ అభిరుచులకు తగ్గట్టు ఇంటీరియర్ వర్క్ చేయించుకుంటారు. వచ్చే ఏడాది వీరు పెళ్లి పీటలు ఎక్కే అవకాశం కనిపిస్తోంది.

## యూఎస్‌లో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్



సంచనాలకు కేరాఫ్‌గా మారిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఓ వైపు అభిమానులు, మరోవైపు సినీ ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్‌డ్‌గా నిర్మిస్తున్నారు. గేమ్ చేంజర్‌ను ఎస్‌వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో విడుదల చేస్తుండగా హిందీలో ఏఏ ఫిలిమ్స్ అనిల్ తడాని రిలీజ్ చేస్తున్నారు. పక్కా ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌కు నెక్స్ట్ రేంజ్‌లో సినిమా ఉండేలా డైరెక్టర్ శంకర్ సినిమాను రూపొందిస్తున్నారు.

తాజాగా 'గేమ్ చేంజర్' మరో సెన్సేషన్ క్రియేట్ చేయటానికి సిద్ధమైంది. ఇండియన్ సినీ హిస్టరీలో ఇప్పటి వరకు మరే సినిమా చేయని అద్భుతాన్ని ఆవిష్కరించనుంది. డిసెంబర్ 21న అమెరికాలో 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ అత్యంత భారీగా జరగనుంది. కర్టిస్ కల్‌వెల్ సెంటర్, 4999 నామన్ ఫారెస్ట్, గార్‌లాండ్ టి.ఎక్స్ 75040 ఈ ముందస్తువేడుకి వేదిక కానుండటం విశేషం. చిత్ర యూనిట్‌తో పాటు ప్రముఖులందరూ ఈ వేడుకకి హాజరుకాబోతున్నారు. రామ్ చరణ్‌పై అభిమానంతో రాజేష్ కల్లెపల్లి ఇంత పెద్ద ఈవెంట్‌ను చేయనుండటం అనేది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఈ సందర్భంగా ఛరిష్మా డ్రీమ్స్ ప్రొడ్యూసర్, యు.ఎస్ ఎగ్జిబిటర్ రాజేష్ కల్లెపల్లి మాట్లాడుతూ ''తెలుగు సినిమాల్లోనే కాదు, ఇండియన్ సినీ ఇండస్ట్రీలోనే ఇప్పటి వరకు యు.ఎస్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించలేదు. తొలిసారి గేమ్ చేంజర్ సినిమా కోసం భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అమెరికాలో చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది.'' అన్నారు.

రామ్ చరణ్ ఈ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ కథను అందించారు. ఎస్.యు.వెంకటేశన్, వివేక్ రైటర్స్‌గా వర్క్ చేశారు. హర్షిత్ సహ నిర్మాత. ఎస్.తిరుణ్ణావుక్కరసు సినిమాటోగ్రఫీ, ఎస్.ఎస్.తమన్ సంగీతం అందిస్తుండగా సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. నరసింహా రావు.ఎన్, ఎస్.కె.జబీర్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా అవినాష్ కొల్ల, యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా అన్బరివు, డాన్స్ డైరెక్టర్‌గా ప్రభుదేవా, గణేష్ ఆచార్య, ప్రేమ్ రక్షిత్, బాస్కో మార్టిన్, జానీ, శాండీ వర్క్ చేస్తున్నారు. రామ్ జోగయ్య శాస్త్రి, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ పాటలను రాశారు.

## నవంబర్ 29న రానున్న సిద్ధార్థ్ "మిస్ యు"

హీరో సిద్దార్థ్ నటించిన లేటెస్ట్ చిత్రం మిస్ యు. ఎన్ రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 29న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 7 మైల్స్ పర్ సెకండ్ సంస్థ నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటించారు.

లవ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో సిద్దార్థ్ మునుపటిలా తనలోని రొమాంటిక్ వైబ్స్ చూపించబోతున్నారు. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ.. ప్రేమలో ఉన్న బలహీనతల చుట్టూ ఈ చిత్ర కథ ఆకట్టుకునే విధంగా ఉంటుంది.

ఈ చిత్రంలో జెపి, పోన్వన్నన్, బాల శరవణన్, కరుణాకరన లాంటి నటులు నటించారు. జిబ్రాన్ సంగీతం అందించారు. కేజీ వెంకటేష్ సినిమా టోగ్రాఫర్‌గా వ్యవహరించారు. సంగీతంతో పాటు సినిమాలోని విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ప్రేమలో సెకండ్ ఛాన్స్ వస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని ఎంటర్టైనింగ్‌గా అదే సమయంలో ఎమోషనల్‌గా చెప్పినట్లు చిత్ర యూనిట్ పేర్కొన్నారు. నవంబర్ 29న రిలీజ్ అవుతున్న మిస్ యు చిత్రాన్ని ఏషియన్ సురేష్ తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూషన్ చేస్తోంది.

## విష్ణు మంచుకు కన్నప్ప టీం పుట్టిన రోజు బెస్ట్ విషెస్



మంచు మోహన్ బాబు తనయుడు, టాలీవుడ్ డైనమిక్ హీరో విష్ణు మంచు నవంబర్ 23న తన 43వ పుట్టిన రోజును జరుపుకున్నారు. సెలబ్రిటీ కిడ్ గా ఇండస్ట్రీ గడప తొక్కిన ఆయన ఎన్నో విలక్షణ పాత్రలు పోషించి తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం గాక, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (MAA) అధ్యక్ష పీఠం దక్కించుకున్నారు. శనివారం విష్ణు మంచు బర్త్ డే సందర్భంగా సినీ లోకంతో పాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు, కన్నప్ప మూవీ యూనిట్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

చైల్డ్ ఆర్టిస్ట్‌గా 1985లో రగిలే గుండెలు సినిమాతో కెమెరా ముందుకొచ్చి విష్ణు మంచు.. చాలా ఏళ్ల తర్వాత 2003లో విష్ణు సినిమాతో హీరోగా పరిచయమయ్యారు. ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం కన్నప్ప సినిమాపై పెట్టారు విష్ణు మంచు. ఇది ఆయన కెరీర్ లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా రాబోతోంది. ఇది విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కూడా. వెండితెరను మించిన కొత్త క్రియేటివ్ వెంచర్‌ను ఆవిష్కరిస్తూ ఈ సినిమాను ప్రారంభించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న కన్నప్ప సినిమాకు ప్రముఖ హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ, యాక్షన్ డైరెక్టర్ కేచా ఖంఫక్డీ , డ్యాన్స్ మాస్టో ప్రభుదేవా వంటి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు.

# ప్రజలకు ప్రతినిధి ... ప్రభుత్వానికి వారధి

○ ఆరేళ్ల ప్రస్థానం పూర్తిచేసుకున్న వీ3 న్యూస్








విలువలువీక్షణంవిజయం అనే నినాదంతో తెలంగాణ ఉద్యమ నాయకుడు, టీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త డా.కాచం సత్యనారాయణ సారథ్యంలో 2018 నవంబర్ 23న మొగ్గతొడిగిన వీ 3 న్యూస్ ఛానల్ ఆరు వసంతాలు పూర్తిచేసుకొని ఏడవ వసంతంలోకి అడుగెడుతోంది. ఈ ఆరు సంవత్సరాలలో వీ 3 న్యూస్ ఛానల్ ప్రజలకు ప్రతినిధిగా, ప్రభుత్వానికి వారధిగా, సంక్షేమానికి సారథిగా పనిచేస్తూ తెలంగాణ వ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందుతోంది. ఈ ఆరేళ్లలో మిగితా ఛానళ్ల మాదిరి వ్యాపారం చేయకుండా ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా విలువలను మాత్రం వదులుకోకుండా పనిచేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమాజ హితమే అభిమతంగా ముందుకు సాగుతోంది. అక్షరాలనే ఆయుధాలుగా చేసుకొని , ప్రసారాలనే అస్త్రాలుగా మలుచుకొని పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తోంది. ఛానల్ ఛైర్మన్ డా.కాచం ఈ వీ3 సంస్థ ద్వారా ఎంతోమంది యువకులకు జర్నలిజం పై అవగాహన కల్పించి , ఉన్నతమైన ఆలోచనలు కలిగి సమాజంలో మంచి రిపోర్టర్స్ గా ఎదిగేలా మార్గదర్శనం చేస్తున్నారు. వీ3 ద్వారా యాంకర్లు గా , రిపోర్టర్స్ గా , సబ్ ఎడిటర్స్ , కెమెరామెన్స్ ఎందరినో అక్కున చేర్చుకొని శిక్షణ అందించి సమాజంలో వారికి ఒక స్థాయికి చేర్చారు. వి 3 న్యూస్ సంస్థ ద్వారా చదువుకున్న నిరుద్యోగులకు రిపోర్టర్లు గా అవకాశాలు కల్పించి వారికి నైపుణ్య శిక్షణ కల్పించి ఉద్యోగులుగా వారి జీవితాలను నిలబెట్టారు.చిన్న ఛానల్ , చిన్న సంస్థ అని చూసిన వాళ్ళే.. నేడు విత్రీ 6 సంవత్సరాలు పూర్తి చేసుకొని ముందుకు సాగుతుంటే నివ్వెర పోతున్నారు.

శాటిలైట్ ఛానెళ్లను తలదన్నేలా కార్యక్రమాలు...

వీ3 న్యూస్ పేరు కేబుల్ ఛానల్ అయినా శాటిలైట్ ఛానళ్లకు దీటుగా వార్తలు, బ్రేకింగ్ న్యూస్, ఆసక్తి కలిగించే, ఆలోచన రేకెత్తించే కథనాలు, ఆరోగ్య, విజ్ఞానదాయక, కాంపిటేటివ్ పరీక్షల కోసం కార్యక్రమాలు అందిస్తోంది. ప్రముఖలతో ఇంటర్వ్యూలు, డిబేట్స్ నిర్వహిస్తోంది. ప్రసారాలలో ఎక్కడ కూడా రాజీ పడకుండా ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ అన్యాయం జరుగుతున్న ప్రతి చోటా నిలబడింది. ఆ సమస్యల కు ఎదురొడ్డి నిలబడి న్యాయం జరిగేవరకు ప్రజాపక్షాన పోరాటం చేస్తూనే ఉంది. అక్రమాలకు , లంచాలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులను , భూకబ్జాదారులను వదిలిపెట్టకుండా సస్పెండ్ చేయించిన ఘనత విత్రీ న్యూస్ రిపోర్టర్లదే. తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఎన్నో ప్రజాహిత కథనాలు , ఎన్నో ఇంటర్వ్యూలు ప్రసారం చేసింది. ఎన్నికల సమయాలలో వేల మంది ప్రజాభిప్రాయాలు సేకరించి ప్రసారం చేసింది. ఎగ్జిట్ పోల్స్ ను వెలువరించింది. ఎన్నికల సమయంలో అంతకుముందు రాజకీయ పార్టీల పాలన కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజలకు వివరించడమే కాక, చేసిన తప్పిదాలను వివరించింది. తెలంగాణ , ఆంధ్రప్రదేశ్, లోక్సభ ఎన్నిక పోలింగ్ , కౌంటింగ్ సమయాల్లో 8 గంటలపాటు నిరంతరంగా విశ్లేషణలను అందించింది.





### సామాజిక సేవలో వీ3 న్యూస్..

ప్రపంచమంతా కరోనా వల్ల అల్లకల్లోలం అవుతున్న సమయంలో కూడా వి త్రీ న్యూస్ ఛానల్ దేనికి సంకోచించకుండా , భయపడకుండా వార్తలను అందించడంలో కీలక భూమిక పోషించింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వి త్రీ న్యూస్ బృందం ఓ వైపు ప్రసారాలు రిపోర్టింగ్ చేస్తూ... మరో వైపు ఎంతోమందికి అన్నదానం చేశారు. ఈ భయాందోళనల లోకూడా వీ3 న్యూస్ రిపోర్టర్లు, సిబ్బంది కరోనా సోకి తాము చనిపోయినా పర్లేదు కానీ ఆకలితో ఎవరూ చావకూడదనే వి త్రీ న్యూస్ ఛానల్ ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ సిద్ధాంతంతో ప్రతి ఒక్కరి ఆకలి తీర్చే ప్రయత్నం చేశారు. వీ3 న్యూస్ తెలుగు రాష్ట్రాలలో కరోనా సమయంలో దాదాపు లక్ష మందికి ప్రత్యక్ష , పరోక్షంగా ప్రతి రోజూ ఫుడ్ డొనేషన్ చేపట్టింది. గ్రామీణ స్థాయి నుండి రాజధాని వరకు ఉన్న రిపోర్టర్స్ ఛైర్మన్ ఆదేశాల మేరకు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అంతేగాకుండా దినసరి కూలీలు, పేదలు, వృద్ధుల కోసం నిత్యావసర సరుకులు అందించడం ,డాక్టర్లు, పోలీసులకు మాస్కులు, ఫుడ్ పాకెట్లు, వాటర్ బాటిళ్లు అందించారు. కరోనా సోకిన బాధితులకు మెడికల్ కిట్స్ , మెడిసిన్స్, ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేశారు.కరోనా వచ్చిన వారికి ధైర్యం చెప్పే ప్రక్రియలో మేధావులు, మోటివేటర్ లతో వీ 3 న్యూస్ ఛానల్ ప్రసారాల ద్వారా కౌన్సిలింగ్ ఇస్తూ బాధితులకు భరోసా కల్పించారు. అంతేగాకుండా ఎంతో మంది రోగులకు, కానీ ప్రెగ్నెంట్ మహిళలకు , ప్రమాదవశాత్తూ గాయపడ్డ వారికి , విత్రీ రిపోర్టర్స్ రక్తదానం చేసి ప్రాణాలను నిలబెట్టారు.

### ఆధ్యాత్మిక సేవలో మేము సైతం...

అయోధ్య రామ మందిరం నిధుల సేకరణ కార్యక్రమంలో వీ3 న్యూస్ భాగస్వామ్యం అవ్వడమే కాకుండా.. రామమందిర ప్రారంభోత్సవానికి విత్రీ న్యూస్ ఛానల్ టీం సీనియర్ కరెస్పాండెంట్స్ దుమ్మాజి నవీన్ , ఏలే మహేష్ నేత , సీనియర్ కెమెరామెన్స్ కొవ్వూరు మహేష్ , ఎలగందుల అఖిల్ , టెక్నికల్ డిపార్ట్మెంట్ చిన్నోజు విద్యా సాగర్, మేడికొండ పరమేష్ వెళ్లి అద్భుతమైన కవరేజీ ఇచ్చారు. అంతేకాకుండా వీ3 ఛానల్ పుణ్యక్షేత్రాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ పీఠాలు తదితర అంశాలపై అనేక కథనాలు ప్రసారం చేసింది.

### సినిమా కార్యక్రమాల కవరేజీలో దండు సురేశ్..

సినిమా కార్యక్రమాలను కవరేజీలో వీ 3 స్టేట్ బ్యూరో దండు సురేష్‌ది అందెవేసిన చేయి. పెద్ద పెద్ద ఛానళ్లు సైతం చేయని ఇంటర్వ్యూలను ఆయన చేస్తుంటారు. అంతేకాకుండా సామాజిక సేవలో భాగంగా గోడలపై సమాజ హిత కొటేషన్లు రాస్తుంటారు.

### న్యూస్ ప్రజెంటర్‌గా ఏలె మహేశ్..

వీ 3 న్యూస్ న్యూస్ ప్రజెంటర్ ఏలె మహేశ్ అద్భుతమైన వాక్పటిమ ప్రేక్షకులను ఆకట్టుకుంటుది. తాను వార్తలు, కథనాలు చదివే విధానంతో పలువురి మన్ననలు పొందారు. మహేశ్ న్యూస్ ప్రజెంటర్‌గానే కాకుండా, యాంకర్‌గా, వ్యాసాల రచయితగా, కార్యక్రమాల నిర్వాహకునిగా, సామాజిక సేవలో రాణిస్తున్నారు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com